PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 161 | విజయవాడ, గురువారం 12 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 12 January 2023 | Rs

అమెరికాలో స్తంభించిన విమాన సర్వీసులు

- భద్రతా పరమైన హెచ్చరికలు ఇచ్చే కంప్యూటర్ వ్యవస్థలో సమస్యలు
- నిలిచిపోయిన 2500 విమానాలు

• లోపలి పేజీలో.. •




సిటీ◆

'నాటునాటు'కు గోల్డెన్ గ్లోబ్

అవార్డు అందుకున్న కీరవాణి

కాలిఫోర్నియా : ప్రముఖ దర్శకుడు రాజమౌళి దర్శకత్వం వహించిన ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు అత్యంత ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించింది. ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డుకు ఈ పాట ఎంపికైంది. కాలిఫోర్నియాలోని ది బెవర్లీ హిల్టన్ హాల్ వేదికగా జరిగిన ఈ అవార్డు వేడుకల్లో ఈ పాటకు సంగీత దర్శకత్వం వహించిన ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం.కీరవాణి ఈ అవార్డును అందుకున్నారు. వేదికపై అవార్డును ప్రకటించిన వెంటనే ఆర్ఆర్ఆర్ బృందం ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. దేశ వ్యాప్తంగా సినిమా పరిశ్రమ సంబరాలు చేసుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, సినిమా రంగానికి చెందిన ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ నుండి ఈ అవార్డును అందుకున్న తొలివ్యక్తిగా కీరవాణి చరిత్ర సృష్టించారు. గతంలో సంగీత దర్శకుడు ఎ.ఆర్ రహమాన్ 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకు 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో ఈ అవార్డును అందుకున్నారు. చరిత్ర సృష్టించిన ఈ పాటకు ప్రముఖ రచయిత చంద్రబోస్ సాహిత్యాన్ని అందించగా, గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ఎన్‌టిఆర్, రామ్‌చరణ్‌లు డ్యాన్స్ చేశారు. అవార్డు ప్రదానోత్సవ వేడుకల్లో రాజమౌళి, కీరవాణి, జూనియర్ ఎన్‌టిఆర్, రామ్‌చరణ్ దంపతులు పాల్గొని సందడి చేశారు. ఈ అవార్డుకోసం భారత చలన చిత్ర పరిశ్రమనుండి ఇప్పటి వరకు ఐదు సినిమాలు నామినేట్ అయ్యాయి. వీటిలో 1959లో నామినేట్ అయిన 'దో అంఖే బారా హాత్ (హిందీ) ఆ ఏడాది ప్రవేశపెట్టిన సామ్యుయేల్ గోల్డ్‌విన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డును దక్కించుకుంది.



'జగనన్న తోడు' చెక్కును విడుదల చేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

స్వయం ఉపాధితో సమాజ హితం

జగనన్నతోడు 6వ విడత విడుదలలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చిరు వ్యాపారులు ఎవరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధితోపాటు సమాజానికి కూడా మేలు చేస్తున్నారని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణం కింద పదివేల రూపాయలు ఇచ్చే జగనన్న తోడు పథకం నిధులు రూ.395 కోట్లను, వడ్డీ కింద రూ.15.17 కోట్లను ఆయన బుధవారం విడుదల చేశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 3.95 లక్షలమంది చిరు వ్యాపారులకు తాజాగా రుణాలు ఇచ్చామని తెలిపారు. గతంలో తీసుకున్న వారందరూ రుణాలు చెల్లించి మరలా రుణం పొందారని పేర్కొన్నారు. 15.31 లక్షల కుటుంబాలకు ఈ పథకం ద్వారా న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఎవరి మీద ఆధారపడకుండా వడ్డీలు, చక్రవడ్డీలు కట్టాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం నుండే సాయం అందిస్తున్నామని వివరించారు. రుణానికి వడ్డీకట్టే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని పేర్కొన్నారు. పాదయాత్ర సమయంలో వారి సమస్యలు గుర్తించానని, ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని వివరించారు. ఆరు విడతల్లో ఇప్పటి వరకూ రూ.2,406 కోట్లు ఇచ్చామని వివరించారు రుణాలు అందుకున్న వారిలో 8.74 లక్షలమంది రుణాలు పూర్తిగా చెల్లించి బ్యాంకర్లతోనూ బేష్ అనిపించుకున్నారని పేర్కొన్నారు. రుణాలు పొందిన వారిలో 80 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల వర్గాలకు చెందినవారే ఉన్నారని తెలిపారు. వీరందరికీ అన్ని విడతల్లోనూ వడ్డీ రూ.63.65 కోట్లు చెల్లించామని వివరించారు. మిగిలిన వారిలోనూ ఎక్కువమందికి అవగాహన కల్పించి రుణం తీసుకునేలా చూడాలని పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో రుణాలు పొందిన వారి జీవన ప్రమాణాలు మారాలన్నారు. మంత్రులు బూడి ముత్యాలనాయుడు, ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ మాట్లాడారు. సిఎస్ జవహర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, అజయ్‌జైన్, ఎస్-ఎల్‌బిసి కన్వీనర్ నవనీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములపై పెద్దల కన్ను

- బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములకు రక్షణ కరువు

• లోపలి పేజీలో.. •

రోడ్ ట్యాక్స్ భారీగా పెంపు



సగటున 30శాతంపైనే ! • లారీ యజమానుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదల, గ్రీన్ ట్యాక్స్‌లతో సంక్షోభంలో వున్న రవాణా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం మరో భారం మోపింది. త్రైమాసిక రోడ్‌ట్యాక్స్‌ను భారీగా పెంచుతూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భారం సగటున 30శాతంపైనే ఉన్నట్లు వాహన యజమానులు చెబుతున్నారు. అయితే, వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్ల ట్రాలీలకు గతంలో మాదిరే ఇప్పుడు కూడా మినహాయింపును కొనసాగించారు. ఆరుటైర్ల లారీలకు గతంలో రూ 3,940లుగా వున్న రోడ్‌ట్యాక్స్‌ను రూ 4,970లకు పెంచింది. అలాగే 10టైర్ల లారీకి రూ 6,580లు వుంటే రూ 8,390లకు పెంచారు. అలాగే 12 టైర్లలారికి రూ 8,520లనుండి రూ10,910లకు, 14 టైర్ల లారీకి రూ 10,480లనుండి రూ 13,430లకు పెంచారు. అలాగే సరుకు రవాణాకు ఉపయోగించే త్రీవీలర్స్‌పై కూడా భారీగా పన్నును పెంచారు. టన్నుబరువును మోసే వాహనంకు రూ 930లు చేశారు. అలాగే 1.5టన్ను వాహనంకు రూ 1,060లు, మూడు టన్నుల వాహనంకు రూ 1,200లు, 4.5టన్నులకు మించితే రూ 1,595లు, 5.5టన్నులకు మించితే రూ 2,435లు పెంచారు. ఈ వాహనాలపై ప్రతి టన్నుకు రూ 665లను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ప్రయాణీకుల వాహనాలకు సంబంధించి ముగ్గురు ప్రయాణికులు వెళ్లే ఆటోరిక్షాలకు రూ16లు, ఏడు మంది వుంటే రూ 820లు, 12మంది ప్రయాణించే వాహనాలకు రూ 1,120లుగా రోడ్‌ట్యాక్స్ నిర్ణయించారు. అదే ఆలిండియా పర్మిట్‌కు అయితే రూ 4వేలుగా పేర్కొన్నారు. అలాగే ప్రైవేట్ బస్ ఆపరేటర్లుకు ఒక్కో ప్యాసెంజర్‌కు రూ 1,080లుగా ట్యాక్స్‌ను నిర్ణయించారు ద్విచక్రవాహనాలకు ట్రైలర్‌ను వాడితే రూ 60లు చెల్లించాలి. భారీగా పెంచిన గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించాలని ఒక వైపున డిమాండ్ చేస్తుంటే, భారీగా త్రైమాసిక రోడ్‌ట్యాక్స్‌ను పెంచడం పట్ల లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరంకుశ జిఓను రద్దు చేయాల్సిందే

ఐక్యవేదిక ఆందోళనకు సిపిఎం సంఘీభావం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో



రోడ్లపై సభలు, సమావేశాలను నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ జిఒ-1ని పూర్తిగా రద్దు చేయాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒంగోలులో జరిగిన సిపిఎం ప్రకాశం జిల్లా విస్తృత సమావేశంలో మాట్లాడారు. బ్రిటీష్ కాలంలో తెచ్చిన జిఒను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తేవడం దుర్మార్గమన్నారు. ఆనాడే దాన్ని అన్ని వర్గాల ప్రజానీకంతోపాటు మేధావులు, న్యాయవాదులు కూడా వ్యతిరేకించారని తెలిపారు. ఇప్పుడు దీన్ని తేవడం అంటే రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఆలోచించాలన్నారు. ప్రజల్లోనూ, పార్టీల్లోనూ వ్యతిరేకత తీవ్రమవడంతో జిఒ నెంబరు 1లో ఎక్కడా సభలు, సమావేశాలు నిషేధం అన్న పదమే వాడలేదని శాంతిభద్రతల విభాగం అదనపు డిజిపి రవిశంకర్ అయ్యన్నార్ చెప్పడాన్ని శ్రీనివాసరావు ప్రస్తావిస్తూ, అలాంటప్పుడు షరతులు కూడా ఎందుకు? అని ప్రశ్నించారు. ఇవన్నీ చేసిన తప్పిదాలను దాటేసేందుకు తప్ప, మరేమీ కాదన్నారు. కందుకూరు, గుంటూరు సంఘటనల నేపథ్యంలో తమను అణచడానికే ఈ జిఒ తెచ్చారని టిడిపి భావిస్తోందని పేర్కొన్నారు. అయితే, ఈ జిఒ ప్రజాఉద్యమాలకు, ప్రజానీకం మొత్తానికి నష్టం కలిగిస్తుందని సిపిఎం భావిస్తోందని తెలిపారు. దీన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఐ కోర్టును ఆశ్రయించిందన్నారు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ఈ జిఒను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రజాస్వామ్యవాదులు, అన్ని వర్గాల మేధావులు, న్యాయవాదులు పోరాడాలని కోరారు. భోగి పండుగ రోజున ఐక్యవేదిక తరుపున చేపట్టిన జిఒ ప్రతుల దహనం కార్యక్రమంలో సిపిఎం సంఘీభావంగా పాల్గొంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్ని సమస్యలనూ వదిలేసి ముందస్తు ఎన్నికల ప్రచారాలను వేగం చేశారన్నారు. కేంద్రం వద్దకు వెళ్లి బతిమలాడుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీల కోసం సిఎం జగన్ కేంద్రంపై ఎటువంటి ఒత్తిడీ చేయడం లేదన్నారు. ముందస్తు ఎన్నికలు బిజెపికి మేలు చేస్తాయంటేనే ఆలోచిస్తారు తప్ప, ఇక్కడ జగన్ లేదా చంద్రబాబు గెలిస్తే వాళ్లకు ఏమీ లాభం ఉండదని పేర్కొన్నారు. దేశానికి బిజెపి చాలా ప్రమాదకరంగా మారిందని తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప ఆ పార్టీకి మరో ఎజెండా ఏమీలేదన్నారు. మోడీ అభివృద్ధి జపాలు వదిలేసి, గుడుల చుట్టూ తిరుగుతున్నారని, మఠాధిపతులు, స్వామీజీలను కలుస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో హిందూవాదంతోనే నెగ్గుకురావాలనే వ్యూహం అమలు చేస్తున్నారన్నారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం మనదేశంలోనూ ప్రభావం చూపుతోందని తెలిపారు. అమెరికాలో వడ్డీరేట్లు పెంచాక భారతదేశంలో షేర్ మార్కెట్ నుంచి రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడి తిరిగి వెనక్కు వెళ్లిపోయిందన్నారు. దేశంలో సంపద అంతా అంబానీ, అదానీ జేబుల్లోకే వెళుతోందని తెలిపారు. పారిశ్రామికోత్పత్తి ప్రమాదంలో పడుతోందన్నారు. నిరుద్యోగం 7 నుంచి 9 శాతానికి పెరిగిందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

ముస్లింలపై విషం చిమ్మిన ఆర్ఎస్ఎస్ చీఫ్

మోహన్ భగవత్ దారుణ వ్యాఖ్యలను ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : ఆర్ఎస్ఎస్ వారపత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన దారుణమైన వ్యాఖ్యలు భారత రాజ్యాంగానికి, పౌరులందరి సమాన హక్కులకు, చట్టబద్ధ పాలనకు తీవ్రమైన బహిరంగ సవాలుగా నిలిచాయని సిపిఎం పేర్కొంది. ఆ వ్యాఖ్యలను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఒక ప్రకటన జారీ చేసింది. సురక్షితంగా వుండాలంటే ముస్లింలు 'ఆధిపత్యపు' ఆలోచనలను విడనాడాల్సి వుంటుందని ముస్లిం మైనారిటీలను ఆయన బెదిరించారు. చారిత్రక తప్పిదాలను గుర్తించడం పేరుతో 'హిందూ సమాజం' దురాక్రమణను ఆయన సమర్ధించుకున్నారు. హిందువులు యుద్ధం మధ్యలో వున్నారని అన్నారు. మతం ప్రాతిపదికగా భారత పౌరుల్లో ఒక వర్గానికి వ్యతిరేకంగా హింసకు పాల్పడాలంటూ ఆయన పిలుపునిచ్చారు.

వాస్తవానికి, దురాక్రమణకు పాల్పడేది హిందూ సమాజం కాదు, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో స్ఫూర్తి పొందిన హిందుత్వ మూకలు దురాక్రమణకు పాల్పడితే, భగవత్ వంటి నేతలు దానికి మద్దతిస్తారు. వివిధ స్థాయిల్లో మైనారిటీ కమ్యూనిటీల రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కులపై నిరంతరంగా దాడులు చేయడం ద్వారా మైనారిటీల్లో తమను చుట్టుముట్టారన్న భావాన్ని సృష్టిస్తారని పొలిట్‌బ్యూరో విమర్శించింది. విధేయులుగా అధీనులై వుండడాన్ని అంగీకరిస్తేనే భారతదేశంలో ముస్లింలు జీవించగలరంటూ హెగ్డేవార్, గోవాల్కర్ వంటి ఆర్ఎస్ఎస్ ప్రముఖులు తమ మతోన్మాద రచనలతో నింపిన విద్వేషానికి నూతన రూపమే భగవత్ ప్రకటనలని సిపిఎం పేర్కొంది.

ఈ దారుణమైన వ్యాఖ్యలను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించి, రాజ్యాంగ మౌలిక విలువలైన లౌకికవాదం, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడికి వ్యతిరేకంగా దేశభక్తియుత శక్తులు, పౌరులు ఐక్యంగా తమ వాణిని వినిపించాలని పిలుపునిచ్చింది.

స్టార్టప్‌లకు 33% తగ్గిన నిధులు



న్యూఢిల్లీ : భారత స్టార్టప్ సంస్థలకు నిధులు తగ్గాయి. గడిచిన ఏడాది 2022లో స్టార్టప్‌లకు ఫండ్స్ 33 శాతం తగ్గి 24 బిలియన్ డాలర్ల (రూ.1.95 లక్షల కోట్లు)కు పరిమితమయ్యాయయని పిడబ్ల్యుసి ఇండియా ఓ రిపోర్టులో తెలిపింది. 2021లో ఈ సంస్థలు 35.2 బిలియన్ డాలర్ల (రూ.2.85 లక్షల కోట్లు)ను సమీకరించగలిగాయి. అయితే ఇంతక్రితం రెండేళ్లతో పోల్చితే గడిచిన ఏడాదిలో రెట్టింపు నిధులు అందాయి. "ప్రస్తుత కఠిన పరిస్థితుల నేపథ్యంలో అనేక స్టార్టప్‌లు కూడా కొత్త పెట్టుబడులు, నిధుల సమీకరణపై వేచి చూసే దోరణీని అవలంభిస్తున్నాయి. భారత స్టార్టప్‌ల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఇప్పటికీ ఆసక్తిగానే ఉన్నారు." అని ఈ రిపోర్ట్ పేర్కొంది. మరో రెండు, మూడు త్రైమాసికాల్లో ఫండింగ్ పరిస్థితులు సాధారణ స్థితికి రావొచ్చని పిడబ్ల్యుసి ఇండియా ఇండియా స్టార్టప్ లీడర్ అమిత్ నౌవ్కా పేర్కొన్నారు. గతేడాది బెంగళూరు, ఎన్‌సిఆర్, ముంబయి నగరాల్లోని స్టార్టప్‌లు అధికంగా నిధులను ఆకర్షించాయని ఈ రిపోర్ట్ తెలిపింది.

తెలంగాణ సిఎస్‌గా ఎ.శాంతికుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా సీనియర్ ఐఎఎస్ అధికారిణి ఎ.శాంతికుమారి నియమితులయ్యారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి వి.శేషాద్రి బుధవారం జిఒ నెంబర్ 64 జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వచ్చిన వెంటనే బిఆర్‌కెఆర్ భవన్‌లోని కార్యాలయంలో సిఎస్‌గా శాంతికుమారి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రగతిభవన్‌కు వెళ్లి సిఎం కెసిఆర్‌ను కలిసి సిఎస్‌గా అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. 1989 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె తెలంగాణ తొలి మహిళా సిఎస్‌గా ఘనత సాధించారు. ఇప్పటివరకు శాంతికుమారి అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సిఎస్ పదవిలో 2025 వరకు కొనసాగనున్నారు. కాగా, హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ సిఎస్ పదవి నుంచి తొలగించబడిన సోమేశ్ కుమార్... డిఒపిటి ఆదేశాల మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి దగ్గర రిపోర్టు చేస్తున్నట్లు తెలిసింది.



అద్దాలు పగిలిన వందే భారత్ రైలు

విశాఖకు వందే భారత్ రైలు

- ట్రయల్ రన్ విజయవంతం
- తిరిగి వెళ్తుండగా రాళ్లు విసిరిన ఆకతాయిలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ, విశాఖ

ట్రైన్ 18 మేడ్-ఇన్-ఇండియా కార్యాచరణలో భాగంగా భారతీయ రైల్వే స్వదేశీయంగా తయారు చేసిన వందే భారత్ సెమీ స్పీడ్ బుల్లెట్ ట్రైన్ బుధవారం సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి వచ్చింది. 8 గంటల 40 నిమిషాల్లోనే అక్కడి నుంచి ఇక్కడికి ఇది చేరుకుందని, గరిష్ట వేగం గంటకు 160 కిలోమీటర్లని రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ సురేష్ తెలిపారు. నిర్వహణ, పర్యవేక్షణతోపాటు ట్రయల్ రన్‌లో భాగంగా ఇక్కడికి ఈ రైలు వచ్చినట్టు చెప్పారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఏడు వందే భారత్ రైళ్లు అందుబాటులో ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాలకు ప్రకటించిన ఈ రైలు ఎనిమిదోదని తెలిపారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య నడిచే ఈ రైలు రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, వరంగల్ స్టేషన్ల మాత్రమే ఆగుతుందని చెప్పారు. 16 ప్యాసింజర్ చైర్ కార్ కోచ్‌లు పూర్తిగా ఎయిర్ కండిషన్ కలిగి 1,128 మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యం కలిగి ఉందని తెలిపారు. కాగా, ఈ రైలు విశాఖ నుంచి తిరుగు వెళ్తుండగా కంచరపాలెం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బోగీలపై రాళ్లు విసిరారు. దీంతో, రెండు కోచ్ అద్దాలు ధ్వంసమయ్యాయి. ఆర్‌పిఎఫ్ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ప్రాంతంలో నిత్యం సంచరించే ఆకతాయిలే ఈ చర్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

హడావుడితోనే సమస్యలు

'జగనన్న శాశ్వత భూహక్కు' లో నిబంధనలు బేఖాతరు • ఆర్భాటానికే పరిమితమవుతున్న సాంకేతికత

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

'జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన భూముల రీసర్వే నిబంధన ప్రకారం జరగడం లేదు. 45 రోజుల్లోనే సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించడంతో సర్వేలో పెద్ద ఎత్తున హడావిడి చోటుచేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసుకున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా ఆర్భాటానికే పరిమితమౌతోంది. దీంతో పాత కష్టాలకు తోడు కొత్త తప్పులు చోటుచేసుకుంటున్నాయన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది భూముల రీ సర్వే కోసం ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. అందుకోసం కార్స్ అనే సాంకేతిక పద్ధతిని ఎంచుకుంది. శాటిలైట్ ద్వారా తీసిన చిత్రాలను ఇప్పటికే ఉన్న భూముల చిత్రాలతో పోల్చి చూశాక, అన్నీ సరిపోయాక తనిఖీలు చేసి ఆమోదించాల్సి ఉంది. ఇందుకోసం అనేక దొంతర్లు కూడా ఉన్నాయి. ఇవన్నీ సక్రమంగా అమలు జరిగితేనే భూముల రికార్డులు సక్రమంగా వస్తాయి. ఈ నిబంధనల మేరకు సర్వే జరగనందునే తప్పిదాలు వస్తున్నాయని రైతు సంఘాల సమన్వయ సమితి విజయవాడలో సిసిఎల్ఆర్‌కు వినతిపత్రం ఇచ్చింది.



జిల్లాల్లో ఎక్కడా జరగాల్సిన పద్ధతిలో జరగనందునే పాసుపుస్తకాల్లో తప్పిదాలు వస్తున్నాయని రైతు సంఘాల సమన్వయ సమితి నేత చుండూరి రంగారావు పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సరిచేయడం లేదని తెలిపారు.

ఇలా చేయాలి...

భూములపై సర్వేకు డ్రోన్‌లు వినియోగించి ఛాయాచిత్రాలు తీస్తున్నారు. ఈ చిత్రాలను రోవర్‌తో తీసిన చిత్రాలతోనూ, ఆ తర్వాత కార్స్ సాంకేతికతో తీసిన చిత్రాలతోనూ సూపర్ ఇంపోజ్ చేయాలి. మ్యాపులు అన్ని సక్రమంగా సరిపోతేనే ఓకే చేయాలి. ఈ ప్రక్రియను దిగువ స్థాయిలో సక్రమంగా చేయడం లేదు. విఆర్‌ఒలు, విఆర్ఎలు, డిప్యూటీ తహాశీల్దార్లు తనిఖీ చేసి నమోదు చేయాలి. వీటిని ఉన్నతాధికారులైన ఆర్‌డిఒ, సబ్‌కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు క్వాలిటీ చెక్ చేయాల్సి ఉంది. ఇది ఎంత మేరకు జరుగుతుందో కూడా స్పష్టత లేదు. తర్వాత రైతుల నుంచి పాసుపుస్తకాలు, 1-బి తీసుకుని తహశీల్దార్ కార్యాయంలోని ఎఫ్‌ఎంబితో సరిచూసి రికార్డు తయారు చేయాలి. దీన్ని మళ్లీ ఆర్‌డిఒ, సబ్‌కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చెక్ చేయాలి. సరిగా లేకుంటే మళ్లీ రీసర్వే చేసి తప్పులను సరిచేయాలి. వీటిపై ఏం జరుగుతుందనేదీ తెలియజేయడానికి రైతులకు నోటీసులు ఇవ్వాలి. గ్రామసభలు పెట్టి రైతులను హాజరు పరిచి రికార్డులు సరిగా ఉన్నాయా? లేదా? అని అభిప్రాయసేకరణ చేయాలి. రైతుల నుంచి సంతకాలు కూడా తీసుకోవాలి. తప్పులు వస్తే వాటిని సరిచేశాక కూడా మళ్లీ గ్రామసభ పెట్టాలి. రైతుల ముందు రికార్డులను ఉంచాలి. వారికి పూర్తిగా అవగాహన వచ్చేలా వివరించాలి. ఎటువంటి తప్పులూలేని భూ పత్రాలు ఇస్తున్నామని రైతులకు గ్రామసభలోనే చెప్పాల్సి ఉంది. రైతులు ఆమోదించాకే అన్ని సరిగా ఉంటేనే పాసుపుస్తకంపై రైతుల వివరాలు ఎక్కించాలి.

ఇలా జరుగుతోంది...!

అనేక చోట్ల ఈ ప్రక్రియ అంతా జరగడం లేదు. . అందుబాటులో ఉన్న

మిగతా 2లో

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

ప్రిన్సిపల్ సెక్రటరీకి జెఎసి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్యశాఖలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్టేట్ గవర్నమెంటు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు మాచర్ల బుజ్జి, డి.రాంబాబు, కిరణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పటిష్టంగా అమల చేస్తున్న ఆరోగ్యమిత్రలకు ఇప్పటికీ క్లాస్ 4 ఉద్యోగుల మాదిరి జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. మిత్రల పనిని పరిగణనలోకి తీసుకుని గ్రూప్ 3 క్యాడర్ మాదిరి వేతనాలు చెల్లించాలని కోరారు. లేదా జిఓ 7 ప్రకారం రూ.21.500 చెల్లించాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన వారికి పదిలక్షలు పరిహారం ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. టి.ఎ, డిఎ చెల్లించాలని, ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, కారుణ్య నియామకాలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

మహిళలకు రివాల్వర్లు ఇవ్వాలి : వంగలపూడి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళల ఆత్మరక్షణ కోసం రివాల్వర్లు ఇప్పించాలని తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత కోరారు. విజయవాడలో వైసిపి కార్యకర్తల దాడిలో గాయపడ్డ మహిళలతో కలిసి టిడిపి కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళలకు అన్యాయం జరిగితే గన్ కంటే ముందు జగన్ వస్తాడన్న మంత్రి రోజాను చూసి జనం నవ్వుతున్నారని పేర్కొన్నారు. చీకటి జిఓ ఇచ్చినట్లే రివాల్వర్ల పంపిణీకి కూడా జగన్ తక్షణమే జిఓ ఇవ్వాలని ఆమె కోరారు. పెన్షన్ అడిగిన మైనార్టీ మహిళల కళ్లల్లో కారంకొట్టి చితగొట్టడమేనా జగన్ సాధించిన మహిళా సాధికారత అని అనిత ప్రశ్నించారు. విజయవాడలో జరిగిన దాడిపై రాష్ట్ర హోంమంత్రి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.

ఎడిజి కట్టుకథలు: బొండా ఉమా

అడిషనల్ డిజి రవిశంకర్ జిఓ 1 పై చెప్పిందంతా తాడేపల్లి ప్యాలెస్ స్క్రిప్టే అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. దళితుల ప్రాణాలు తీస్తున్న వారికి నెల్లూరు ఎస్పి విజయరావు కొమ్ముకాస్తూ తనజాతి కుటుంబాలను రోడ్డునపడేస్తున్నారని టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు విమర్శించారు. వైసిపి నేతలకు ఊడిగం చేస్తూ తమను అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దళితులపై దాడిచేస్తున్నవారిని రక్షించడానికే తనను అర్ధరాత్రి అరెస్టు చేసి 600 కిలోమీటర్లు తిప్పారని విమర్శించారు. జగన్ పాలనలో పెరిగిన నిత్యావసర ధరలు, పేదల ఆకలి ఆర్తనాదాలతో సంక్రాంతి చీకటి సంక్రాంతిగా మారిందని టిడిపి అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ విమర్శించారు.

ఎపి పేపర్‌మిల్లు కార్మికుల దీక్షలు ప్రారంభం

- యాజమాన్యం మెడలు వంచేలా ఐక్య పోరాటాలు : సిఐటియు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరంలోని ఎపి పేపర్ మిల్ యాజమాన్యం అనుసరిస్తోన్న చట్ట వ్యతిరేక, నిరంకుశ విధానాలకు నిరసనగా పేపర్‌మిల్లు గేట్ ఎదురుగా కార్మికులు బుధవారం నిరసన దీక్షలకు పూనుకున్నారు. దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ ప్రారంభించి మాట్లాడారు. మిల్లు యాజమాన్యం నిరంకుశ విధానాలపై కరపత్రాలు పంపిణీ చేయడంతోపాటు గేటు మీటింగులు నిర్వహించాలని, మిల్లులో పనిచేసే కార్మికులందరినీ ఈ పోరాటంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా పేపర్ మిల్లులో కలెక్షన్ల పరంపర సాగిస్తున్నారని విమర్శించారు. యాజమాన్యం తొత్తులుగా వ్యవహరిస్తున్న ప్రవీణ్ చౌదరి కార్మిక హక్కులను, చట్టాలను యాజమాన్యానికి తాకట్టు పెడుతున్నారని అన్నారు. జెసిఎల్, డిసిఎల్ స్థాయి అధికారులు సైతం యాజమాన్యానికి కొమ్ముగాస్తున్నారని విమర్శించారు. కార్మికులు చేసే ఉద్యమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఎఐటియుసి నాయకులు మధు మాట్లాడుతూ 25 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించకుండా పరంపర-2 పేరుతో బయట వ్యక్తులకు ఉద్యోగాలు అమ్ముకోవడం అన్యాయమన్నారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరికాదని తెలిపారు. దీక్షలకు సిఐటియు నాయకులు ఎస్ఎస్.మూర్తి, ఎఐటియుసి నాయకులు కుంద్రపు రాంబాబు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో పేపర్ మిల్లు యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న సిఐటియు, ఎఐటియుసి ఇతర కార్మిక సంఘాల నాయకులు



పోస్టర్ విడుదలచేస్తున్న రాష్ట్ర కార్యదర్శి రామన్న, నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు

కానిస్టేబుల్ అభ్యర్థులకు 'డివైఎఫ్ఐ' మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోసం డివైఎఫ్ఐ మోడల్ పరీక్ష నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న ఎంబి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ డివైఎఫ్ఐ పోరాటం ఫలితంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు, 411 ఎస్సై పోస్టులకు నవంబర్ 28న నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తు చేశారు. నాలుగేళ్ల నుంచి పోలీస్ శాఖలో నోటిఫికేషన్ లేదని, వయోపరిమితి కూడా ఐదేళ్లకు పెంచాలని పెద్దఎత్తున ఆందోళన నిర్వహించామని చెప్పారు. తమ పోరాట ఫలితంగా ప్రభుత్వం వయోపరిమితి రెండేళ్లకు పెంచిందన్నారు. దీంతో 5 లక్షల మంది అభ్యర్థులు కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఈ నెల 22న కానిస్టేబుల్ పోస్టులకు ప్రిలిమ్స్ పరీక్షను రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించనుంది తెలిపారు. అయితే శిక్షణ పొందేందుకు సమయం కేటాయించకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అభ్యర్థుల్లో పరీక్షల పట్ల భయాందోళన లేకుండా, ప్రశ్నాపత్రం పట్ల అవగాహన కోసం మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రం సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 18న అన్ని జిల్లాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరగనుంది చెప్పారు.కానిస్టేబుల్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు, నాయకులు ఎన్ కృష్ణ పాల్గొన్నారు.

పిఎల్‌జిఎ అగ్రనేత హిడ్మా హతం?

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు పిఎల్‌జిఎ అగ్రనేత మడవి హిడ్మా బీజాపూర్-తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్టు సరిహద్దులో ప్రచారం జరిగింది. తెలంగాణ గ్రేహౌండ్స్, సిఆర్‌పిఎఫ్ కోబ్రా జాయింట్ ఆపరేషన్ నిర్వహించిందని, అందులో హిడ్మా మృతి చెందాడని అటు ఛత్తీస్‌గఢ్ ఇటు తెలంగాణ మీడియాలో బ్రేకింగ్ న్యూస్ వేస్తున్నారు. అయితే మావోయిస్టు కేంద్ర కమిటీ రాత్రి వరకు హిడ్మా మృతిని ధృవీకరించలేదు. గతంలోనూ హిడ్మా చనిపోయాడని, పోలీసులకు లొంగిపోయాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ తర్వాత మావోయిస్టులు హిడ్మా బతికే ఉన్నట్టు ప్రకటన జారీ చేశారు. అంతేకాకుండా హిడ్మా లొంగుపోయారంటూ



తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వ సైకలాజికల్ వార్ చేస్తున్నదని దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ అప్పట్లో ఓ ప్రకటన జారీ చేసింది. 43 ఏండ్ల హిడ్మా దాదాపు దశాబ్ద కాలంగా దండకారణ్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులను హతమార్చాడు. దక్షిణ బస్తర్ ప్రాంతంలోని సుక్మా జిల్లా పువర్తి గ్రామం ఆదివాసీ తెగకుచెందిన వ్యక్తి హిడ్మా. 1996-97లో తన 17వ ఏట మావోయిస్టు పార్టీలో చేరిన అతను శత్రువులను మట్టు పెట్టడంలో దిట్ట.

షోకాజ్ నోటీస్‌లో స్పష్టత ఉండాలి

- భవన కూల్చివేత నోటీసు రద్దు చేసిన హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

నిర్మాణాల కూల్చివేతకు ఇచ్చే షోకాజ్ నోటీసుల్లో ఎవరికి సమాధానం చెప్పాలో లేకపోతే ఎలాగని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చే అధికారి ఒకరు, షోకాజ్ నోటీస్ ఇచ్చే అధికారి మరొకరని, ఈ పరిస్థితుల్లో నోటీసు అందుకున్న వాళ్లు ఎవరికి వివరణ ఇవ్వాలో నోటీసులో లేకపోతే ఎలాగని అడిగింది. చట్ట నిబంధనలు ఏం చెబుతున్నాయో చెప్పాలంది. షోకాజ్ నోటీసుకు ఎవరికి వివరణ ఇవ్వాలని చట్టం చెబుతోందో వెల్లడించాలని అధికారులను ఆదేశించింది. ఈమేరకు తామిచ్చిన తీర్పు కాపీని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శికి పంపాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు తిరిగి నోటీసు ఇచ్చి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చునని డిప్యూటీ సిటీ ప్లానర్‌ను ఆదేశిస్తూ జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఇటీవల తీర్పు చెప్పారు. విజయవాడ వన్‌టౌన్, రామ్‌గోపాల వీధిలోని బిల్డింగ్ కూల్చేందుకు ఇచ్చిన నోటీసుకు వివరణ ఇచ్చినా దానిని పరిగణనలోకి తీసుకోకుండా భవనాన్ని కూల్చివేతకు నోటీసు ఇచ్చారంటూ ఆర్.మోహిని హైకోర్టులో పిటిషన్ వేశారు. తొలి నోటీసుకు ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోకుండా రెండో నోటీసు ఇవ్వడాన్ని ఆమె లాయర్ బి.అభయ్ సిద్దాంత్ తప్పుపడుతూ వాదించారు. షోకాజ్ నోటీసులకు వివరణ ఇచ్చినా భవనాన్ని కూల్చివేసేందుకు తుది ఉత్తర్వులు ఇవ్వడం చెల్లదన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని కార్పొరేషన్ లాయర్ ఎం. మనోహర్‌రెడ్డి సమర్థించారు. పిటిషనర్‌కు టౌన్ ప్లానర్ బిల్డింగ్ ఆఫీసర్ షోకాజ్ నోటీసులు ఇచ్చారని, అయితే వివరణను నేరుగా కమిషనర్‌కు పంపారని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు నోటీసులో స్పష్టత లేకపోవడాన్ని తప్పుపట్టింది. భవనం కూల్చివేత ఉత్తర్వులను రద్దు చేసింది.

పర్యాటక ప్రాంతాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంతో పాటు ఇరుగుపొరుగు రాష్ట్రాల్లోని పర్యాటక, ప్రముఖ అధ్యాత్మిక ప్రాంతాలకు ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడుపుతామని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమల, తిరుపతి, తిరుచానూరు, కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ, అన్నవరం తదితర కీలకమైన అధ్యాత్మిక క్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీలతో ప్రత్యేక బస్సులు నడుపుతామని, అవసరమైన సందర్భాల్లో ట్రిప్పుల వారీగా ప్రత్యేక సర్వీసులు కూడా నడపుతామని ఆయన తెలిపారు. అవసరమైన చోట్ల గైడ్‌ను, రాత్రి పూట వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పర్యాటక శాఖతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. గత ఏడాదిలో శబరిమలకు వెళ్ళే వారికోసం 225 బస్సులు నడిపామని, అదే అనుభవంతో తమిళనాడులోని అరుణాచలానికి 156 బస్సులను విజయవంతంగా నడిపామన్నారు. కార్తీక మాసంలో 'ఒకే రోజులో పంచారామాల దర్శని' పేరుతో వివిధ జిల్లాల నుండి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. త్రిలింగ దర్శిని, మన్యం దర్శిని, అన్నవరం, అంతర్వేది తిరనాళ్ళు, యాగంటి, ద్వారకాతిరుమల, సింహాచలం, అహోబిలం, శ్రీశైలం తదితర అధ్యాత్మిక ప్రదేశాలకు ప్రత్యేక ప్యాకేజీలు వున్నాయన్నారు. మహాశివరాత్రికి కోటప్పకొండకు, దసరాకు విజయవాడ కనకదుర్గ గుడికి ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు.

సోషల్‌మీడియాలో కోరినా చాలు..

బస్సు కావాలని చేయాలని ఎవరైనా సోషల్‌మీడియా ద్వారా అభ్యర్ధించినా తాము ఏర్పాటు చేస్తామని ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కెఎస్ బ్రహ్మానందరెడ్డికి ఎస్ వెంకటరావు అనే ప్రయాణీకుడు కృష్ణా జిల్లా పామర్రు నుండి విజయనగరం జిల్లా నెల్లిమర్లకు 40 మంది వెల్లేందుకు బస్సు కావాలని ఫేస్‌బుక్‌లో కోరగా వెంటనే గుడివాడ డిపో నుండి బస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. రైళ్లతో పోలిస్తే బస్సులో సమయం ఆదా అయ్యే అవకాశం వున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ రైల్వే డివిజన్‌లో ట్రాక్ మెయిన్‌టెన్స్ రిపేర్లు జరుగుతున్న దృష్ట్యా ఈనెల 11, 12, 13 తేదీల్లో పలు రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. 11, 12 తేదీల్లో విజయవాడ- బిట్రగుంట (07978) విజయవాడ - గూడూరు (07500) ట్రైన్లను రద్దు చేసినట్లు తెలిపారు. 12న కాకినాడ పోర్టు - విశాఖపట్టణం (17267), విశాఖపట్టణం - కాకినాడ పోర్టు (17267). విజయవాడ- ఒంగోలు ()7461), ఒంగోలు -విజయవాడ (07576) రైళ్లను రద్దు చేశారు. 12, 13 తేదీల్లో బిట్రగుంట- చెన్నై సెంట్రల్ (17237) చెన్నై సెంట్రల్ - బిట్రగుంట రైళ్లు రద్దు చేశారు. 13, 14 తేదీల్లో బిట్రగుంట- విజయవాడ(07977) రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. ఈనెల 12న కాకినాడ పోర్టు - విజయవాడ (17258), విజయవాడ- కాకినాడ (17257) ట్రైన్లను పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.



సంబరాలు జరుపుకుంటున్న సిఐటియు నాయకులు

హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో సిఐటియు విజయభేరి

ప్రజాశక్తి -ములగాడ, విశాఖ

హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో సిఐటియు విజయభేరి మోగించింది. ఈ ఎన్నికలో పెట్రోలియం వర్కర్స్ యూనియన్ విశాఖ రిఫైనరీ, హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్యానళ్లు పోటీ పడ్డాయి. 1018 మంది ఓటర్లు ఉన్నారు. కో-ఆపరేటివ్ సొసైటీ అధికారి బడే శ్రీను ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. సాయంత్రం ఐదు గంటల తర్వాత లెక్కింపు ప్రారంభమైంది. హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్యానల్‌కు చెందిన చందా శ్రీనివాసులు- 533, డి.సూర్యప్రకాష్- 524, బి.విజయబాబు -514, బి.పార్ధసారథి- 509, అరవింద్ కుమార్ -505, వి.ఎల్.శ్యాంప్రసాద్- 500, బి.హరికృష్ణ -496, సి.జగదీశ్వరరావు- 491, విజయకుమార్- 485 ఓట్లను సాధించి విజయం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌పిసిఎల్ గేటు వద్ద సిఐటియు నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

ఉక్కు ప్రజాగర్జనతో పోరాటం తీవ్రతరం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయడం ద్వారా పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 699వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఆర్‌ఎంహెచ్‌పి, ఎసిఎస్, హెచ్‌ఆర్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నాయకులు వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, గుమ్మడి నరేంద్ర, డి శ్రీనివాస్ మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని, దీన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, దీనిని ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే ఎదుర్కొగలమని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపుకు స్పందించి ఈ ప్రజా ఉద్యమంలో పాలు పంచుకోవాలని కోరారు.



సంక్రాంతికి ఒక డిఎ

- ఉద్యోగ సంఘాలకు సిఎం హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండు కొత్త డిఎల్లో ఒక డిఎను సంక్రాంతి రోజు ప్రకటిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎపి ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగుల జెఎసి వెల్లడించింది. సిఎం జగన్‌ను పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిశాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల డైరీలు, క్యాలెండర్లను సిఎం ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యలపై సంఘాల నాయకులు పలు వినతిపత్రాలు సిఎంకు అందించారు.

బకాయి పడ్డ వివిధ ఎపిజిఎల్ఐ, పిఎఫ్, డిఎ లోన్లు, క్లైమ్స్‌ల్లో కొంతమేర జనవరి ఆఖరులోపు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఎపి జెఎసి చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ జి హృదయరాజు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెంచిన 62 పదవి విరమణ వయస్సును పబ్లిక్ సెక్టార్, ఇతర విద్యాసంస్థల ఉపాధ్యాయులకు అమలు చేస్తూ త్వరలోనే ఉత్తర్వులు ఇస్తామని సిఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లామని, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని సానుకూలత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన వారిలో జెఎసి కో చైర్మన్లు హెచ్ తిమ్మన్న, కెఎస్ఎస్ ప్రసాద్, సీతారామరాజు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కెవి శివారెడ్డి తదితరులు ఉన్నారు. ఎపి సివిల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు పి ధర్మచంద్రారెడ్డి, కె మోహన్ కుమార్, ఈ మురళి,ఎపి సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు కె వెంకటరామిరెడ్డి, నాయకులు సిహెచ్ ఎర్రన్న యాదవ్, ఎం సత్య సులోచన, ఎపి ప్రభుత్వం ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ, నాయకులు అస్కార్ రావు, జిఎం రమేష్, వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు ఓబులాపతి, జాలిరెడ్డి, అశోక్, సుధీర్, పిఆర్‌టియు అధ్యక్షులు గిరిప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ బృందానికి గవర్నర్ అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు సాధించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినంధనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందాన్ని, ప్రత్యేకంగా సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, దర్శకులు ఎస్ఎస్‌రాజమౌళిని గవర్నర్ అభినందించారు. అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ సంగీత వేదికపై గర్వింప చేసిందన్నారు. సాహిత్యం సంగీతానికి తగ్గట్లు నృత్యరీతులను అభినయించిన ఎన్‌టిఆర్, రామ్‌చరణ్‌లకు మంచి భవిష్యత్తు ఉండాలన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కూడా వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు.

కనీస మద్దతు ధరల చట్టం తేవాలని కోరుతూ 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ల ర్యాలీ

- రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ సవరణ బిల్లు 2020 ఉపసంహరించాలని, కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని కోరుతూ ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ప్రకటించింది. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, నాయకులు వై కేశవరావు, కె ప్రభాకరరెడ్డి, రావుల వెంకయ్య, కెవివి ప్రసాద్, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, రాజమోహన్, సింహాద్రి ఝాన్సీ, హరినాథ్ తదతరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుండి ఇప్పటి వరకూ కార్పొరేట్ సంస్థలకు రూ.10 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అనుగుణంగా సి2ప్లస్50 శాతం ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం తెస్తామని హామీనిచ్చిందని, ఇంతవరకు అమలు చేయలేదని వివరించారు. ఢిల్లీ రైతుల ఉద్యమంలో అమరులైన 750 మంది రైతుల కుటుంబాలన్నిటికీ పరిహారం ఇవ్వాలని, రైతులపై పెట్టిన 80 వేల కేసులు ఉపసంహరించుకోవాలని కోరారు. సింఘూ బోర్డర్లో రైతు ఉద్యమానికి గుర్తుగా చిహ్నం ఏర్పాటు చేయాలని కోరారు. కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా రైతులకు సంపూర్ణ రుణవిముక్తి కల్పించాలని కోరారు. సమగ్ర భూ సర్వేలో పెద్దఎత్తున జరిగని తప్పులను సరిచేసిన తర్వాతే రైతులకు పాసు పుస్తకాలు ఇవ్వాలని, రైతులకు కేంద్రం ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ద్రోహం చేసిన వైనంపైన ఈ నెల 26న విజయవాడతోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమవేశంలో నాయకులు రంగారావు, జమలయ్య, మరీదు ప్రసాదుబాబు, వెంకటరెడ్డి, ప్రసాదు, పివి ఆంజనేయులు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వాహనాలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది

- మంత్రి కారుమూరి వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందిస్తున్న ఎండియూ వాహనాల ఆపరేటర్లు ప్రతి ఏటా చెల్లించాల్సిన రూ.9.2 కోట్ల బీమా మొత్తాన్ని ఇక నుంచి ప్రభుత్వమే చెల్లిస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇప్పటి వరకు వాహన లబ్ధిదారుల నుంచి బీమా ప్రీమియాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు వసూలు చేస్తూ ఏటా పది వేలు వారి వేతనం నుంచి బీమా కంపెనీలు కోతపెడుతున్నాయన్నారు. ఎండియూ లబ్ధిదారుల వేతనాలను బ్యాంకుల్లో ప్రభుత్వం జమ చేస్తుండటంతో అందులో నుంచి బీమా ప్రీమియాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు వసూలు చేస్తున్నాయన్నారు. బీమా ప్రీమియం చెల్లింపులు తమకు ఇబ్బందిగా ఉందని తమ దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయాన్ని సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వమే ఆమొత్తాన్ని చెల్లిస్తుందని హామీ ఇచ్చారని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఈ మేరకు బ్యాంకులన్నింటికి సిఎం జగన్ లేఖ రాశారని తెలిపారు. ఈ నెల 13న ప్రీమియం నగదును విడుదల చేయాలని సిఎం,ఆర్థికశాఖను ఆదేశించారు. దీంతో ఎండియూ లబ్ధిదారులకు భారీ ఊరట కలుగుతుందన్నారు. రాష్ట్రం మొత్తం మీద అన్ని జిల్లాల్లో కలిపి 9060 ఎండియూ వాహనాలు కలిగిన లబ్దిదారులు ఉన్నారన్నారు.

వైసిపి గూండాలకు కొమ్ముకాస్తున్న పోలీసులు

- డిజిపికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి గుండాలతో పలుచోట్ల పోలీసులు కుమ్మక్కు అయ్యారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ఇలాంటి పోలీసులకు డిజిపి మద్దతు ఇస్తుండటం విస్మయానికి గురిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. పుంగనూరులో టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు, అరెస్టులు చేశారని డిజిపికి బుధవారం చంద్రబాబు లేఖ రాశారు. టిడిపి కార్యకర్తలపై ఉద్దేశపూర్వకంగా సెక్షన్ 307, ఎస్సి,ఎస్టి వేధింపుల నిరోధక సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు విమర్శించారు. పుంగనూరులో టిడిపి వారిపై పెట్టిన కేసుల్లో ఫిర్యాదుదారులుగా పోలీసులు, స్థానిక రెవెన్యూ అధికారులు ఉంటున్నారని తెలిపారు. నిందితుల జాబితాతో పాటు ఎఫ్ఐఆర్‌లో ఇతరులను చేర్చుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మాచర్ల, కుప్పం, తంబళ్లపల్లె తదితర ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోందని తెలిపారు. ఎఫ్ఐఆర్ నెం 2/2023లో పేర్కొన్న రెవెన్యూ అధికారి ఫిర్యాదులో తమ పార్టీ నేతలపై కఠినమైన సెక్షన్లు పెట్టారని, వైసిపి నేతలపై సాధారణ సెక్షన్లతో నామమాత్రపు కేసు పెట్టారని విమర్శించారు. ఈ చర్యలు పోలీసుల అధికార దుర్వినియోగాన్ని ఎత్తిచూపుతున్నాయని పేర్కొన్నారు. ఈ కేసులు ఒక వర్గం పోలీసులు, వైసిపి నేతలకు మధ్య జరిగిన కుమ్మక్కుకు సాక్ష్యమని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో పోలీస్ యూనిఫాం ధరించకుండా, నేమ్ బ్యాడ్జ్ ధరించకుండా వచ్చి నిందితులను తీసుకెళ్తున్నారని తెలిపారు. ఇంత పెద్దఎత్తున చట్టాన్ని ఉల్లంఘించిన పోలీస్ అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని విమర్శించారు.

పెద్దిరెడ్డి పని అయిపోయింది..

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పని అయిపోయిందని చంద్రబాబు మరో ప్రకటనలో విమర్శించారు. దూసుకొస్తున్న పసుపు సైన్యాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక కొందరు పోలీసుల సహకారంతో శిఖండి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. 10 రోజుల్లో ఐదు ఎఫ్ఐఆర్‌లు రాయించి దాదాపు 80 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టారని పేర్కొన్నారు.

మిర్చి రైతుల కష్టాలపై వ్యవసాయ శాఖ స్పందించాలి

మిర్చి రైతుల కష్టాలపై వ్యవసాయ శాఖ స్పందించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. నల్ల తామర పురుగుతో మిర్చి రైతులు వరుసగా రెండో ఏడాది కూడా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పంటను కాపాడుకునేందుకు రకరకాల మందుల వాడకంతో పెట్టుబడి రెట్టింపవుతుందని పేర్కొన్నారు. పురుగుమందు ధరల నియంత్రణపై వ్యవసాయ శాఖ దృష్టి పెట్టాలని కోరారు. తామర పురుగు నివారణకు రైతులకు తగు సూచనలు ఇవ్వాలని సూచించారు.

హడావుడితోనే సమస్యలు

(మొదటి పేజీ తరువాయి)

రికార్డులను తీసుకుని నమోదు చేస్తున్నారు. డ్రోన్‌లు తీస్తున్న చిత్రాలను మ్యాపులతో సరిపోల్చడం అరకొరే! ఇక అధికార యంత్రాంగమూ తనిఖీ చేయడం నామమాత్రమే!

రైతులతో ఎక్కడా గ్రామసభలు పెట్టడం లేదు. పాసుపుస్తకం వచ్చాక వేలిముద్ర వేయించుకుని పుస్తకం చేతిలో పెడుతున్నారు. దీంతో ఇప్పటి వరకూ జారీ చేసిన పుస్తకాల్లో 60 నుంచి 70 శాతం పుస్తకాల్లో తప్పిదాలు దొర్లినట్లు కనిపిస్తున్నారు.

ఆచరణలో కనిపించని ఎడిట్ ఆప్షన్

పాసుపుస్తకాల్లో తప్పిదాలను రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు సిసిఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎడిట్ ఆప్షన్ ఉందని, దాన్ని వినియోగించి పాసుపుస్తకాల్లో తప్పిదాలను సరిచేస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఈ ఆప్షన్‌ను వినియోగించి పాసుపుస్తకాల్లో జరిగిన తప్పిదాలను ఎక్కడా పరిష్కారం చేయలేదు. ఒక్కో పాసుపుస్తకంలో పదుల సంఖ్యలో పేర్లు వచ్చినా అలాగే ఉన్నాయి. దీనిపై కలెక్టర్ల సమీక్షలోనూ సిసిఎల్ఎ ఆర్ సాయిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యుటేషన్లు చేయకుండా పాసుపుస్తకాలు ఎలా జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. అయినా, మార్పు కనపడటం లేదు.

సంక్రాంతి సంబరాల్లో అపశృతి

- భోగి మంట ఎగిసిపడి చిన్నారులకు గాయాలు

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం, అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలోని విజ్డం పబ్లిక్ స్కూల్లో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో అపశృతి చోటు చేసుకుంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కాన్వెంట్ ఆవరణంలో వేసిన భోగిమంటలు ఎగిసిపడటంతో మూడవ తరగతి విద్యార్థినులు మధుర కీర్తన(8), పోతుల వనీష(8), యుకెజి విద్యార్థి దిగుమర్తి సామ్యూల్‌స్టీఫెన్(6) గాయపడ్డారు. భోగిమంట ఆరిపోవడంతో బాటిల్‌లో ఉన్న పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడినట్టు సమాచారం. గాయపడిన ముగ్గురు చిన్నారులను హుటాహుటిన అమలాపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. బాధితులను రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపి అనురాధ, కలెక్టర్ హిమాన్షు శుక్లా పరామర్శించారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ.. మెరుగైన వైద్యం కోసం చిన్నారులను కిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు. ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు, స్కిన్ స్పెషలిస్ట్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. చిన్నారులకు ఏటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి స్కూలు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గాయాలు పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

లక్ష్యాన్ని మించి వ్యవసాయ ఉత్పత్తులు

- వైసిపి రైతు విభాగం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుతం ఆహార ధాన్యాలు, పండ్లు ఉత్పత్తి భారీగా పెరిగిందని వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. జగన్ హాయంలో వ్యవసాయ ఉత్పత్తులు లక్ష్యాన్ని మించి రైతులంతా సంతోషంగా వున్నారని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయం లో ఆయన మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబు, కరువు కవల పిల్లలని ప్రజలు చెబుతున్న తరహాలో ఆయన పాలనంతా కరువులతో వుండేదని అన్నారు. గతంలో ఇతర ప్రాంతాలకు పెద్దఎత్తున వలసలు వెళ్లేవారని అన్నారు. భూగర్భ జలాలు సైతం గణనీయంగా పెరిగాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ నిండాయని అన్నారు.

దళితుల భూములపై పెద్దల కన్ను

- బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములకు రక్షణ కరువు



కృష్ణా జిల్లా నందివాడ మండలం ఇలపర్రులో చెరువులుగా మారిన సొసైటీ భూములు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

రిజిస్ట్రేషన్ల నిషేధి జాబితా 22 'ఎ' నుంచి కండిషన్ పట్టా భూములకు విముక్తి కల్పిస్తున్నామనే పేరుతో దళితుల, పేదల భూములను భూస్వాములకు, బడాబాబులకు ప్రభుత్వం ధారాదత్తం చేస్తోంది. దళితులు, పేదల భూములను ఆక్రమించి అనుభవిస్తోన్న భూస్వాములు, బడాబాబులకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు కేసులను, గతంలో ఈ భూములపై ఇచ్చిన ఉత్తర్వులను పట్టించుకోకుండా కొత్తగా ప్రభుత్వం ఇటువంటి ఉత్తర్వులివ్వడం చర్చనీయాంశమైంది. కృష్ణా జిల్లా నందివాడ మండలంలోని 14 గ్రామాల్లో 1107.01 ఎకరాలను ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో బ్రిటీష్ ప్రభుత్వం 1921లో దళితులు, ఇతర పేదలకు పంపిణీ చేసింది. అనమనపూడిలో 34.31 ఎకరాలు, అరిపిరాలలో 5.29, దండిగానిపూడిలో 81.64, ఇలపర్రులో 205.21, జనార్ధనపురంలో 0.16, కుదరవల్లిలో 35.56, నందివాడలో 26.12, నూతులపాడులో 1.46, పెదవిరివాడలో 18.90, పోలుకొండలో 406.37, రుద్రపాకలో 201.75, తమిరిశలో 43.14, తుమ్మలపల్లిలో 16.70, వెన్ననపూడిలో 30.04 ఎకరాల పంపిణీ జరిగింది. 1995 తర్వాత ఆక్వా సాగు విస్తరించే క్రమంలో ఈ భూములను బడాబాబులు ఆక్రమించారు. వాటిని తిరిగి తమకు ఇవ్వాలని ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యుల వారసులు గత కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆయా గ్రామాల్లోని బాధితులు ఆందోళనలు చేస్తున్నారు. పిఒటి యాక్టు 9/77 ప్రకారం దళితులకు పంపిణీ అయి 1995 తర్వాత ఆక్రమణలు, అమ్మకాలు జరిగిన భూములకు సంబంధించి అమ్మకాలు, కొనుగోళ్లు చెల్లవని గతంలోనే పలువురు జిల్లా అధికారులు స్పష్టం చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ భూములను షరతులుగల పట్టాలుగా పేర్కొంటూ నిషేధిత భూముల జాబితా 22 ఎ (ఇ)లో చేర్చారు. ఇటీవల ఈ భూములకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం 2022 అక్టోబర్ 11న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో దళితులు, పేదలకు చెందిన ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములు ఆక్రమించిన బడాబాబులకు ఇది వరంగా మారింది. ఎటువంటి పరిశీలనా లేకుండానే పెద్దలకు వీటిని కట్టబెట్టేందుకు అధికారులు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అనుమతి!

ఇలపర్రు రెవెన్యూ గ్రామంలో 167 ఎకరాల భూమి కోర్టు వివాదంలో ఉంది. భూస్వామి ఆక్రమించిన 17 ఎకరాలను ప్రభుత్వం 2007లో స్వాధీనం చేసుకుంది. ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్ కోర్టులు సైతం ఈ భూమిని క్లయిం చేసే హక్కు భూస్వామికి లేదని తేల్చాయి. ఈ గ్రామంలోని ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములను తిరిగి తమకు పంపిణీ చేయాలని సొసైటీ సభ్యుల వారసులు 2014 నుంచి ఆందోళన నిర్వహిస్తున్నారు. అప్పటి నుండి 95 ఎకరాల భూమి బీడుగా ఉంది. 51 ఎంక్వైరీలో ఈ భూముల్లోని 70 ఎకరాలు ఎటువంటి ఆధా రమూ లేకుండా పెద్దలు సాగు చేసుకుంటున్నారని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆక్రమించిన పెద్దలే ఈ భూములను వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి జిల్లా అధికారులు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగి వివాదాస్పద భూములకు అధికారులు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

9/77 చట్టం ప్రకారం 1954 తర్వాత దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల కొనుగోలు, అమ్మకాలు నిషేధం. నందివాడ మండలంలో 1995 తర్వాత సొసైటీ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. పేదలకు దక్కాల్సిన ఈ భూములను పెద్దలకు కట్టబెట్టేలా ప్రభుత్వాధికారులు ఉత్తర్వులివ్వడం సరికాదు. వెంటనే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి.

-మురాల రాజేష్, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి

టిడ్కో ఇళ్ల అప్పగింతలో తాత్సారం

లబ్ధిదారులకు అండగా పోరాడతాం • రాజధానిలో టిడ్కో ఇళ్ల పరిశీలనలో బాబూరావు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సిహెచ్ బాబూరావు, ఇతర నాయకులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో టిడ్కో ఇళ్ల అప్పగింతలో ప్రభుత్వం ఏళ్ల తరబడి జాప్యం చేయడం వల్ల వాటిల్లో విషపురుగులు నివసిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. రాజధానిలోని మందడం సమీపంలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ఉన్న టిడ్కో గృహ సముదాయాన్ని సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. అనంతరం బాబూరావు మాట్లాడుతూ.. కోర్టు వివాదాలు లేని 5,024 టిడ్కో ఇళ్లను రాజధానిలోని పేదలకు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. రూ.50 వేలు, రూ.లక్ష డిపాజిట్లు చెల్లించి నాలుగేళ్లు దాటిపోయినా పేదలకు ఇళ్లు కేటాయించలేదని ఆవేదన వెలిబుచ్చారు. లబ్ధిదారుల పేరుతో బ్యాంకు రుణాలు తీసుకువచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం వల్ల బ్యాంకుల నుండి లబ్ధిదారులు రుణ చెల్లింపు ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాజధానిలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు 95 శాతం పూర్తయ్యాయని, మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఇళ్ల కేటాయింపులు చేయవచ్చని తెలిపారు. ఇళ్లు కేటాయించకుంటే పేదలే స్వాధీనం చేసుకుంటారని, వారికి సిపిఎం అండగా నిలుస్తుందని చెప్పారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనే ఐదు శాతం భూములు పేదల నిర్మాణాలకు కేటాయించాలని ఉన్న దాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. సామాజిక న్యాయం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు కేటాయించకుంటే ఉద్యమానికి పూనుకుంటామన్నారు. ఓట్ల కోసం, మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి 2024 జనవరి నాటికి అయోధ్యలోని రామాలయ నిర్మాణం పూర్తవుతుందని బిజెపి అగ్రనేతలు ప్రకటిస్తున్నారని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదల ఇళ్ల నిర్మాణాల ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశీలనలో సిపిఎం రాజధాని కార్యదర్శి ఎం.రవి, నాయకులు ఆంజనేయులు, వి.వెంకటేశ్వరరావు, జానీ పాల్గొన్నారు.

అటవీకార్మికుల ఆందోళన పట్టని ప్రభుత్వం

- వారికి న్యాయం చేయాలి : మధు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సచివాలయ వ్యవస్థతో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని సిపిఎం మాజీ ఎంపి మధు అన్నారు. వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని తెలిపారు. తిరుపతిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులను ఉత్సవవిగ్రహాలుగా మార్చారని విమర్శించారు. గిట్టుబాటు ధర లేక, నాణ్యమైన విత్తనాలు లేక అన్నదాత ఇబ్బంది పడుతుంటే కల్తీ విత్తనాలిచ్చే బడాబాబుల కొమ్ముగాస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 70 రకాల పనులు చేసే అసంఘటితరంగ కార్మికులు 80 లక్షలకు పైగా ఉంటే వారికి నెలవారి కూలి రూ.6,200గా ఉందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో రూ.11,587గా ఉందని తెలిపారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 800 రోజులుగా టిటిడి అటవీ కార్మికులు ఆందోళన చేస్తుంటే యాజమాన్యం, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. ప్రతిపక్షాలు, ప్రజా, ఉద్యోగసంఘాల గొంతునొక్కేలా జిఒ నంబర్ ఒకటి తీసుకొచ్చారని విమర్శించారు. జగన్ చేసే తప్పులను ప్రశ్నిస్తే జిఒను చూపి నోరు నొక్కేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. జగన్ పాలనలో కార్మికులు, రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోయేలా ఉందన్నారు. ప్రజాప్రయోజనాలను గాలికొదిలి ఏకపక్షంగా జగన్ పరిపాలన ఉందని, కనీసం మంత్రులకు అధికారాలు ఇవ్వకుండా ముఖ్యమంత్రి వ్యవహరించడం సరైంది కాదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన అనంతపురం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, సాగుభూమి పట్టాలు మంజూరు చేయాలని, జగనన్న కాలనీల్లో వేగవంతంగా ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో జిల్లాలో 39 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు 3,600 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయన్నారు. గ్రామాలు, పట్టణాలకు సమీపంలోనే ప్రభుత్వ భూములు ఉన్నా సుదూర ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు చూపడం వల్ల ఇళ్ల నిర్మాణాలకు మొగ్గుచూపడం లేదని తెలిపారు. తొలుత ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చి, తరువాత అనేక నిబంధనలు తీసుకొచ్చి గ్రహణం పట్టించారని విమర్శించారు. రూ.1.80 లక్షలతో లబ్ధిదారులే ఇల్లు కట్టుకోవాలంటే సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే ప్రభుత్వానికిగానీ, రెవెన్యూ అధికారులకుగానీ పట్టడంలేదనంటూ ఆగ్రహం వ్యకంచేశారు. గుత్తిలో ఎనిమిదేళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తుంటే కొందరు నకిలీ పత్రాలు సృష్టించి వారిని ఖాళీ చేయించే కుట్ర చేశారని తెలిపారు. దీంతో పేదలు కోర్టును ఆశ్రయించారని అన్నారు. అనంతపురం రాజీవ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్‌డిఒ ఆయా గ్రామాల్లోని లబ్ధిదారుల అర్జీలను పరిశీలించి అర్హులందరికీ ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ముగిసిన ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు అంత్యక్రియలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ప్రిన్సిపల్, రాజనీతిశాస్త్ర ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్లు (88) అంత్యక్రియలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కోటిలింగాల పేట కైలాసభూమిలో బుధవారం ముగిశాయి. వెంకటేశ్వర్లు వయోభారంతో మంగళవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం నగరంలోని ఎవి అప్పారావు రోడ్డు, అగర్వాల్ హాస్పిటల్స్ సమీపంలోని స్వగృహంలో ఉంచారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పూర్వ విద్యార్థులు అంతిమయాత్ర నిర్వహించారు. వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు(వై.వి), జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా, నగర కార్యదర్శులు టి.అరుణ్, బి.పవన్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చిలుకూరి శ్రీనివాస్, సిఐటియు నాయకులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సిపిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు తదితరులు

హీరోలు, కులాల పేరుతో వైసిపి విధ్వంసం : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హీరోలు, కులాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు అధికార పార్టీ సన్నద్ధమైందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇద్దరు అగ్రహీరోల సినిమాలు విడుదలవుతున్న సందర్భాన్ని సోషల్ మీడియాలో ఫేక్ ఖాతాల ద్వారా ఒక కులం పేరుతో మరో కులంపై విషం చిమ్మాలని కుట్రలు పన్నారని పేర్కొన్నారు. విష ప్రచారాలు చేసి కుల,మత, ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిల్చిన దుష్టచరిత్ర గలిగిన వారి ట్రాప్‌లో ఎవరూ పడొద్దని కోరారు. సినిమాలు అంటే వినోదమని, వాటిని వివాదాలకు వాడుకోవాలనే అధికార పార్టీ కుతంత్రాలను తిప్పికొడదామని పిలుపునిచ్చారు. 'మనమంతా ఒక్కటే కులం, మతం, ప్రాంతమని ఏవీ మనల్ని విడదీయలేవని' పేర్కొన్నారు.

మంత్రి అంబటిపై కేసు నమోదుకు ఆదేశం

- సత్తెనపల్లిలో లక్కీడ్రా పేరుతో వసూళ్లు
- జనసేన ఫిర్యాదుతో కోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు చేయాలని బుధవారం గుంటూరు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎ.అనిత పోలీసులను ఆదేశించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని వైఎస్ఆర్ సంక్రాంతి లక్కి డ్రా పేరుతో వైసిపి నాయకులు లాటరీ టికెట్లు అమ్ముతున్నారని కొద్ది రోజుల క్రితం జనసేన నాయకులు సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయకపోవడంతో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు గుంటూరు జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారించిన న్యాయమూర్తి తక్షణమే మంత్రి అంబటిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులే లక్ష్యంగా టికెట్లు విక్రయిస్తున్నారని గాదె వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఇందుకు సంబంధించి మంత్రి అంబటి రాంబాబు లాటరీ టికెట్ల కోసం చేసిన ప్రచార వీడియోను కోర్టుకు సమర్పించారు. రాష్ట్రంలో లాటరీ వ్యాపారానికి అనుమతి లేకపోయినా బహుమతుల పేరిట టికెట్లు విక్రయిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరుపున న్యాయవాది ఆర్.వంశీకృష్ణ వాదించారు.

గ్రూప్ 4 పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖాళీగా ఉన్న నాల్గవ తరగతి (గ్రూప్ 4) పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని రాష్ట్ర నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఎన్‌టిఆర్ జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను అమరావతి జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడసిటీ జెఎసి ఛైర్మన్ కోసూరి సురేంద్ర,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సమాఖ్య స్ఫూర్తిపై దాడి

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి చర్యలు ముమ్మాటికి సమాఖ్య స్ఫూర్తిపై దాడే. గవర్నర్‌గా నియమితులైనప్పటి నుండి ఆయన వివాదాస్పదంగానే వ్యవహరిస్తున్నారు. ఆయన తీరుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ఎప్పటికప్పుడు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశారు. అయినా, గవర్నర్ వ్యవహార శైలిలో ఇసుమంత మార్పు రాలేదు. సరికదా మరింత దిగజారింది. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ పాఠానికి తన ఇష్టం వచ్చినట్లు మార్పులు చేర్పులు చేసి రాష్ట్ర శాసనసభలో చదవడం దీనికి పరాకాష్ట. దీనిపై పెద్దఎత్తున విమర్శలు చెలరేగుతుండగానే సివిల్ సర్వీసు అభ్యర్థులతో బుధవారం జరిపిన ముఖాముఖిలో కేంద్రం చెప్పినట్లు మాత్రమే నడుచుకోవాలని చెప్పడాన్ని బరితెగింపుగానే అర్థం చేసుకోవాలి. మాజీ ఐపిఎస్ అధికారి అయిన రవికి రాజ్యాంగం, దాని నిర్దేశాలు, ప్రజాస్వామ్య సాంప్రదాయాల గురించి తెలియవని అనుకోలేం. అయినా, ఇలా వ్యవహరిస్తున్నారంటే ఉద్దేశ్యపూర్వకమే తప్ప మరొకటి కాదు! తమిళనాడు రాష్ట్రాన్ని ఆ పేరుతో పిలవడానికి ఎవరికైనా అభ్యంతరం ఎందుకు ఉండాలి? ద్రవిడ ఉద్యమ నేపథ్యాన్ని ఏమాత్రం అంగీకరించని సంఘ్‌పరివార్‌కు మాత్రం ఆ పేరు నచ్చదు. కొంతకాలంగా ఆర్ఎస్ఎస్ సూచిస్తున్న తమిళగం పేరును రాష్ట్రానికి పెట్టాలని గవర్నర్ ప్రవచిస్తున్నారు. శాసనసభలో చదవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగపాఠంలోనూ తమిళనాడుకు బదులుగా తమిళగంను ఆయన చేర్చి చదివారు. ఇది, డిఎంకె ప్రభుత్వాన్ని కాదు, యావత్ తమిళ ప్రజలను అవమానించడమే! ఆ రాష్ట్ర ప్రజలు ఎంతగానో గౌరవించే సిఎన్ అన్నాదొరై తమిళనాడు పేరును మొట్టమొదట ప్రతిపాదించారు. రాష్ట్ర అసెంబ్లీ దానిని అమోదించింది. తమ భాష, సంస్కృతి, రాజకీయాలకు తమిళనాడు పేరు అద్దం పడుతుందని అక్కడి ప్రజలు భావిస్తారు. అటువంటిది శాసనసభ రికార్డుల్లోనే ఆ పేరును తనకు తోచినట్టు మార్చి చదవడానికి గవర్నర్ సిద్ధపడారంటే అర్థం ఏమిటి? ఇదొక్కటే కాదు, అన్నాదొరై, అంబేద్కర్ల పేర్లతో పాటు కులవ్యవస్థపై తిరుగులేని పోరు సాగించిన ద్రవిడ ఉద్యమ ప్రస్తావనకు సంబంధించిన పేరాలను కూడా చదవడానికి గవర్నర్ ఇష్టపడలేదు. వాటికి బదులు తన చిత్తానికి తోచిన మాటలు ఆయన చెప్పారు. అందుకే, గవర్నర్ ప్రసంగానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రసంగపాఠాన్నే శాసనసభ రికార్డుల్లో చేర్చాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపాదించాల్సి వచ్చింది. దానిని సభ ఏకగ్రీవంగా ఆమోదించడం ఆహ్వానించదగిన పరిణామం.

శాసనసభలో చదవాల్సిన ప్రసంగపాఠాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే గవర్నర్‌కు పంపుతుంది. దానిని పరిశీలించి, ఆమోదించిన తరువాతే తుది పాఠాన్ని ఖరారు చేస్తారు. ఒక వేళ అభ్యంతరాలుంటే, తెలియచేస్తే ప్రభుత్వం సవరించే అవకాశం ఉంటుంది. ఒకవేళ సవరించకుండా అదే ప్రసంగాన్ని మళ్ళీ పంపితే గవర్నర్ దానిని ఆమోదించాల్సిందే. అలా ఆమోదించిన ప్రసంగాన్నే సభలో చదవాలి. ఇది రాజ్యాంగ సంప్రదాయం! అత్యున్నత న్యాయస్థానం కూడా అనేక సందర్భాల్లో దీనినే ధృవీకరించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు విధి నిర్వహణలో సొంత అభిప్రాయాలకు తావు లేదంటూ రాజ్యాంగ నిర్దేశ సారాంశం కూడా ఇదే! రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రసంగ పాఠాన్ని ఆమోదించి, చదవాల్సిన సమయంలో దానిని పక్కన పెట్టి సొంత అభిప్రాయాలనో, తనను నడిపించే వారి అభిప్రాయాలనో ఏకరువు పెట్టడం ద్వారా రాజ్యాంగ విలువలను రవి తుంగలో తొక్కారు. గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా కూడా ఆయన భావించవచ్చు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నరే ముఖం! ఆయన పేరుతోనే రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలన్నీ సాగుతాయి. సమాఖ్య వ్యవస్థ బలపడాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంధానకర్తలుగా గవర్నర్లు వ్యవహరించాలి. సమన్వయానికి చొరవ చూపాలి.

నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలతో గవర్నర్ల ఘర్షణ ధోరణి పెరిగింది. కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాలా ఉంది. ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదు. రాష్ట్రాలను బలహీన పరిచి, బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న బిజెపి, సంఘ్‌పరివార్ సిద్ధాంతంలో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయి. వీటిని ప్రతిఘటించి, సమాఖ్య వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత భారత ప్రజలందరిది.

మహనీయుల మాట



ఇతరుల కోసం జీవించేవారు
నిజంగా జీవించి వుంటారు.
- వివేకానంద



ఎరువుల సమస్య వెనుక పాలకుల కుట్ర

విశ్లేషణ



వి.రాంభూపాల్

రైతులను భూముల నుండి, వ్యవసాయం నుండి తొలగించడానికి అవసరమైన అన్నింటిని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నది. అందులో భాగమే నేడు దేశం ఎదుర్కొంటున్న ఎరువుల సమస్య. సహకార వ్యవస్థను ధ్వంసం చేయడం, బ్యాంకుల్లో చిన్న, సన్నకారు రైతులకు రుణ పరపతి తగ్గించడం, గిట్టుబాటు ధరలు అమలు చేయకపోవడం, మార్కెట్‌ను వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్చేయడం జరుగుతున్నది. తమ కార్పొరేట్ అనుకూల విధానాలను కప్పిపుచ్చుకునేందుకు మతం, దేశభక్తితో పాటు, ప్రజల ఆరోగ్య విషయాలను వాడుకుంటున్నది. ఎరువుల సమస్య నుండి మధ్యతరగతి దృష్టి మళ్లించేందుకు సేంద్రియ వ్యవసాయం అంటున్నారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, సేంద్రియ వ్యవసాయం అనడంలోనే వీరి కపటత్వం తెలుస్తున్నది.



రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు తోడు ఎరువుల సమస్య నేడు దేశవ్యాప్తంగా తీవ్రంగా వుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఎరువుల ధరలు, ఎరువుల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తున్నది. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, నాసిరకం విత్తనాలు, వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడం, ప్రభుత్వ రుణ సహాయ తగ్గిపోవడం లాంటి సమస్యలతో రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభం ఏడాదికేడాదికి తీవ్రమవుతూనే వుంది. ఇలాంటి స్థితిలో పంటలకు కీలకమైన ఎరువుల ధరలు పెరగడంతో పాటు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడానికి కారణాలు ఏమిటి? ఎరువుల కొరత ఎందుకని ఇంత తీవ్రమైంది? పాలకులు సహజంగా చెప్పే ప్రపంచ పరిస్థితులే కారణాలా? సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకా? లేక వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే చర్యల్లో భాగమా?

మొక్కల పెరుగుదలకు, ఆరోగ్యానికి అవసరమైన నత్రజని, పోటాషియం, ఫాస్పరస్ వంటి పోషకాలను ఎరువుల రూపంలో రైతులు భూమికి అందించి పంటలు పండించుకోవడం కొన్ని దశాబ్దాలుగా వుంది. ప్రస్తుతం ఎరువులు వేయకుండా, పురుగు మందులు వాడకుండా పంటలు పండని పరిస్థితి ఏర్పడింది. పాలకుల విధానాల వల్ల సాంప్రదాయ విత్తనాల స్థానంలో అన్ని పంటలకు కంపెనీ విత్తనాలే దిక్కయ్యాయి. అలాగే సేంద్రియ ఎరువుల స్థానంలో కంపెనీల ఎరువుల వాడకం పెరిగేకొద్ది భూసారం తగ్గి ప్రతి ఏటా ఎరువుల వినియోగం పెంచాల్సి వస్తుంది. వీటివల్ల ఎరువుల, పురుగు మందుల వాడకం భారీగా పెరిగిపోయింది. డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ రంగంలో ఎరువుల ఉత్పత్తి పెంచాల్సిందిపోయి... ప్రభుత్వ మరియు సహకార కార్మగారాల్లో ఎరువుల ఉత్పత్తిని తగ్గించి, క్రమంగా మూతవేస్తున్నది. ఈ పరిస్థితులను ప్రైవేటు కంపెనీలు చక్కగా ఉపయోగించుకొని భారీగా లాభపడుతున్నాయి. మారిన ఈ పరిస్థితులవల్ల చేతిలో నగదు వుంటేనే పంటలు సాగుచేసే పరిస్థితి రైతాంగానికి ఎదురైంది. అందువల్ల చిన్న, సన్నకారు రైతులు పంటలు పెట్టలేని పరిస్థితి, ఒకవేళ అప్పులు చేసి పంటలు సాగుచేసినా గిట్టబాటు ధరలు లేక అప్పుల్లో కూరుకుపోవడం లేదా ఆత్మహత్యలు చేసుకోవడం పెరిగిపోయింది.

పెరిగిన ఎరువుల వినియోగం

హరితవిప్లవం పేరుతో వ్యవసాయ రంగంలో అనేక విధానాలు అమలు చేశారు. ముఖ్యంగా పంటల దిగుబడి పెంచడం వంటివి చేపట్టారు. వీటికోసం ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం పెరిగింది. 1991లో ప్రారంభించిన ప్రైవేటీకరణ విధానాలు ప్రభుత్వరంగ ఎరువుల ఉత్పత్తిని తగ్గించి ప్రైవేట్ కంపెనీలకు భారీ రాయితీలు ఇవ్వడం పెరిగింది. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2016-17లో ఎరువుల డిమాండ్ 614.33 వేల టన్నులు ఉండగా, ఉత్పత్తి మాత్రం 414.41 వేల టన్నులకు తగ్గింది. 2019-20 నాటికి డిమాండ్ 640.48 వేల టన్నులు, ఉత్పత్తి 245.01 వేల టన్నులు మాత్రమే జరిగింది. దేశంలో 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 8 భారీ యూరియా ఉత్పత్తి పరిశ్రమలు మూతపడ్డాయి. 1961లో స్థాపించబడిన ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నాగార్జున యూరియా, సహకార రంగంలోని ఇఫ్కో లాంటివి మూతపడే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకున్న స్వదేశీ, విదేశీ ఎరువుల కంపెనీలు తమ ఉత్పత్తిని పెంచేశాయి. 1970లో 0.4 మిలియన్ టన్నుల ఎరువులు దిగుమతి కాగా, 2003-24 నాటికి 6 మిలియన్ టన్నులు, 2018-19 నాటికి 29.81 లక్షల మిలియన్ టన్నులు, 2020 నాటికి దేశంలో వినియోగించే యూరియాలో 25 శాతం, డిఎపిలో 68 శాతం, పొటాష్ నూరు శాతం విదేశీ దిగుమతుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెద్దఎత్తున పెరిగిన క్రిమిసంహారక మందుల వినియోగాన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు కంపెనీలు నాణ్యత లేని బయోకెమికల్స్, బయో ఫెర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసి రైతులను నిలువునా ముంచేస్తున్నాయి.

రైతులపై ఎరువుల భారం- కార్పొరేట్లకు రాయితీల లాభం

డిఎపి 2019లో 64 లక్షల టన్నులు, 2020లో 44.95 లక్షల టన్నులు, 2021 అక్టోబర్ 31 నాటికి 14.63 లక్షల టన్నులు మాత్రమే మార్కెట్‌లో వుంది. ఈ పరిస్థితి డిమాండ్‌ను పెంచింది. దాని ప్రభావం ధరల పెరుగుదలపై తీవ్రంగా పడి రైతులకు మోయలేని భారంగా మారింది. ఉదాహరణకు గత సంవత్సరం పొటాష్ 50 కిలోల బస్తా రూ. 1040 వుండగా, నేడు రూ.1700కు, 24:24:0:18 రూ.1550 నుండి రూ. 1900కు పెరిగాయి. క్రిమిసంహారక మందుల ధరలకు అదుపు లేదు. పెరిగిన ఎరువుల ధరల చాటున తన కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఎరువుల సబ్సిడీలు పెంచినట్ల గొప్పగా చెప్పుకుంటున్నది. ఈ సబ్సిడీ పంటలు పండించే రైతులకు కాకుండా ఎరువులు ఉత్పత్తి చేసే కంపెనీల ఖాతాలకు చేరుతున్నాయి. ఫెర్టిలైజర్ కంపెనీలకు ఎరువుల సబ్సిడీ పేరుతో 2017-18లో రూ. 69,197 కోట్లు చెల్లించగా, 2020-21 నాటికి రూ. 1,27,921 కోట్లు చెల్లించారు. ఒకవైపు ప్రభుత్వ ఎరువుల కర్మాగారాలను మూసివేసి ఉద్యోగులను తొలగించి, రైతులపై భారాలు వేస్తూ, రెండోవైపు దేశ విదేశీ ప్రైవేట్ కంపెనీలకు కోట్ల రూపాయలను సబ్సిడీల పేరుతో కట్టబెడుతున్నది.

కార్పొరేట్ వ్యవసాయం కోసం...

రైతులను వ్యవసాయం నుండి దూరం చేసి కార్పొరేట్ వ్యవసాయాన్ని పెంచాలన్నది పాలకుల విధానం. ఒకనాడు భూస్వామ్య, ధనిక రైతాంగంతో రాజీ పడిన దేశీయ పెట్టుబడిదారీ ప్రభుత్వాలు తమ విధానాల ద్వారా ఈ వర్గాలను తమలో కలిపేసుకున్నారు. భూస్వామ్య, ధనిక రైతాంగం పల్లెలు వదిలి పట్టణాలు, మహానగరాల్లోకి చేరారు. కాంట్రాక్టు, సినిమా, విద్యా, వైద్యం, హోటల్, లాడ్జింగ్, ట్రావెల్స్ లాంటి అనేక వ్యాపారాల్లో చేరి పెట్టుబడిదారులుగా మారారు. గ్రామాల్లో భూములపై వున్న హక్కు ద్వారా వచ్చే రాజకీయ పెత్తందారీ విధానాన్ని, కులమత విశ్వాసాలను పెంచిపోషిస్తున్నారు. అనేక గ్రామాల్లో పాతపడిన దేవాలయాల పునరుద్ధరణ, దేవరలు, జాతరలు లాంటి వాటికి వీరే మూలవిరాట్‌లుగా వుంటున్నారు. తమ భూములను కౌలుదార్ల ద్వారా సాగు చేయిస్తూ, ప్రభుత్వం నుండి వచ్చే అన్ని రాయితీలను గద్దల్లా తన్నుకుపోతున్నారు. మరోవైపు పెద్ద పెట్టుబడిదారులు ఉత్పత్తి చేసి లాభపడడంతో సంతృప్తి చెందడంలేదు. గంటల్లో, రోజుల్లో కోటీశ్వరులు కావడానికి ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారులుగా మారి ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా కొనేయడం, భూములు కబ్జా చేసుకొని రియల్ ఎస్టేట్ లాంటి వ్యాపారాలతో కుబేరులుగా మారుతున్నారు. అన్ని రంగాల్లోకి చివరకు కోట్ల మంది ఆధారపడిన రిటైల్ వ్యాపారంతో పాటు, వ్యవసాయ రంగాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమయ్యారు. వీరికి బిజెపి కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని రకాల అండదండలు అందుతున్నాయి. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను మొండిగా అమలు చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేసింది ఈ వర్గాల కోసమే. రైతులను భూముల నుండి, వ్యవసాయం నుండి తొలగించడానికి అవసరమైన అన్నింటిని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నది. అందులో భాగమే నేడు దేశం ఎదుర్కొంటున్న ఎరువుల సమస్య. సహకార వ్యవస్థను ధ్వంసం చేయడం, బ్యాంకుల్లో చిన్న, సన్నకారు రైతులకు రుణ పరపతి తగ్గించడం, గిట్టుబాటు ధరలు అమలు చేయకపోవడం, మార్కెట్‌ను వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్చేయడం జరుగుతున్నది. తమ కార్పొరేట్ అనుకూల విధానాలను కప్పిపుచ్చుకునేందుకు మతం, దేశభక్తితో పాటు, ప్రజల ఆరోగ్య విషయాలను వాడుకుంటున్నది. ఎరువుల సమస్య నుండి మధ్యతరగతి దృష్టి మళ్లించేందుకు సేంద్రియ వ్యవసాయం అంటున్నారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, సేంద్రియ వ్యవసాయం అనడంలోనే వీరి కపటత్వం తెలుస్తున్నది. నూటికి 54 శాతం దేశ ప్రజలు ఆధారపడిన వ్యవసాయాన్ని... కొద్దిమంది చేతిలో వున్న కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే చర్యలను ప్రతిఘటించే క్రమంలోనే ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించ బడతాయి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు /

తల్లీబిడ్డల మరణాలు పట్టవా?

హిజాబ్, హలాల్, లవ్ జిహాద్ తప్ప

సమస్య



ఎం. కోటేశ్వరరావు

"ధనిక రాష్ట్రం-అధ్వాన్న సూచికలు:కర్ణాటక నివేదిక" అంటూ డెక్కన్ హెరాల్డ్ దినపత్రిక 2022 డిసెంబరు ఏడవ తేదీన ఒక విశ్లేషణను ప్రచురించింది. దానిలో కొన్ని అంశాల సారం ఇలా ఉంది. వర్తమాన సంవత్సర బడ్జెట్‌లో కర్ణాటక ప్రభుత్వం ఆరోగ్య శాఖకు 5.8, విద్యకు 12.9 శాతం కేటాయించింది. ఇది జాతీయ సగటు 6, 15.2 శాతాల కంటే తక్కువ. దేశ తలసరి సగటు రాబడి రూ.1.51 లక్షలు కాగా కర్ణాటకలో రూ.2.49 లక్షలుగా ఉంది. కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ ప్రకటించిన 2021 ఆకలి సూచిక దేశ సగటు 47 కాగా కర్ణాటకలో 53 ఉంది. తమిళనాడు 66, కేరళ 80 పాయింట్లతో ఎగువున ఉన్నాయి. ఐదు దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే తలసరి రాబడిలో తెలంగాణా తరువాత కర్ణాటక రెండవ స్థానంలో ఉంది. కానీ ఆకలి సూచికలో మాత్రం రాజస్థాన్‌కు దగ్గరగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలో దీన్ని, ఇతర మానవాభివృద్ధి సూచికల గురించి ఆలోచించాల్సిన బిజెపి పెద్దలు వాటిని విస్మరించి రాష్ట్ర ప్రజలకు తక్షణం కావాల్సింది లవ్ జిహాద్ నిరోధం అని, అందుకు గాను తమను ఎన్నుకోవాలని చెబుతున్నారు. ఏ విత్తనం వేస్తే ఆ చెట్టుకు అవే ఫలాలు వస్తాయి.

ధనిక రాష్ట్రాలలో ఒకటైన కర్ణాటక దానికి అనుగుణంగా వివిధ సూచికల్లో లేదు. దక్షిణాది రాష్ట్రాలలో 2020 సమాచారం ప్రకారం కొన్ని సూచికలు ఇలా ఉన్నాయి.

అంశం (లక్షకి)	కర్ణాటక	ఆంధ్రప్రదేశ్	తమిళనాడు	కేరళ
ప్రసూతి మరణాలు	83	58	58	30
పుట్టిన పిల్లల మరణాలు	19	24	13	6
పుట్టినవెంటనేమరణాలు	14	17	9	4
5ఏళ్లలోపుపిల్లలమరణం	21	27	13	8

కేరళతో పోలిస్తే తల్లీ, పిల్లల మరణాలను తగ్గించేందుకు కర్ణాటక ప్రభుత్వం చేయాల్సిన పనులెన్నో ఉండగా దాని ఊసు లేకుండా మీ పిల్లలను లవ్ జిహాద్ నుంచి రక్షిస్తామని బిజెపి నేతలు చెబుతున్నారు. అంటే వారికి సున్నితమైన అంశాలను రెచ్చగొట్టి ఓట్లు పొందటం మీద ఉన్న శ్రద్ధ తల్లీ, పిల్లల సంక్షేమం మీద లేదన్నది వేరే చెప్పనవసరం లేదు. కర్ణాటక ఇతర సూచికల్లో కూడా అంత ఘనమైన రికార్డేమీ లేదు. 2019 సూచిక ప్రకారం మానవాభివృద్ధి సూచికలో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను మూడు తరగతులుగా వర్గీకరించారు. వాటిలో కర్ణాటక మధ్యతరహా జాబితాలో 0.683తో ఐదవ స్థానంలో, మొత్తంలో 19వ స్థానంలో ఉంది. దేశ సగటు 0.646కు దగ్గరగా ఉంది. కేరళ 0.782తో ప్రథమ స్థానంలో ఉంది. కర్ణాటక స్థానాన్ని మెరుగుపరచటం అనే ఎజెండా బిజెపికి లేదు.

దేశంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో కర్ణాటక ఒకటి. ఇక ఐ.టి రంగంలో దేశానికి రాజధానిగా, మేథో కేంద్రంగా ఉంది.



అలాంటి చోట 60 శాతం మంది పిల్లలు పదకొండవ తరగతిలో చేరకుండానే చదువు మానివేస్తున్నారు. 2021-22 వివరాల ప్రకారం తమిళనాడులో 81, కేరళలో 85 శాతం మంది పన్నెండేళ్ల పాటు విద్య నేర్చుకున్నవారు ఉండగా కర్ణాటకలో 40 శాతానికి మించి లేరు. వారి చదువు సంధ్యల గురించిగాక లవ్‌జిహాద్ గురించి బిజెపి తల్లిదండ్రులకు చెబుతున్నది.

మే నెలలో జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న బిజెపి అక్కడ రెండు ఇంజన్ల గురించి చెప్పటం లేదు. ఎందుకంటే రెండు ఇంజన్లు పని చేస్తున్నా అక్కడ స్థితి ఎలా ఉందో చూశాము. అందువలన దాని కేంద్రీకరణ అంతా హిజాబ్, హలాల్, లవ్ జిహాద్ మీదనే ఉంది. మెజారిటీ హిందువులను మనోభావాలతో సంతుష్టీకరించి ఓటు బాంకును ఏర్పాటు చేసుకోవాలని చూస్తున్నది. ఇటీవల కర్ణాటక వచ్చిన కేంద్ర మంత్రి అమిత్ షా మాండ్యలో జరిగిన సభలో మాట్లాడుతూ అయోధ్యలో రామాలయాన్ని నిర్మించిన, కాశీ, కేదారనాథ్, బదరీనాథ్‌లను అభివృద్ధి చేసిన నరేంద్రమోడీ కావాలా? టిప్పు సుల్తాన్ను గొప్పగా చూపిన వారు కావాలో తేల్చుకోవాలని ఓటర్లను కోరారు. ఆ తరువాతే కొనసాగింపుగా రాష్ట్ర నేత నళిన్ లవ్‌జిహాద్ నివారణకు బిజెపిని ఎంచుకోవాలన్నారు.

కర్ణాటకలో హిజాబ్ వివాదాన్ని ముందుకు తెచ్చిన తీరుతెన్నులను చూశాము. దాని వలన రాష్ట్ర జిఎస్‌డిపి పెరగలేదు, ఉపాధి అవకాశాలు రాలేదు, ధరలు తగ్గలేదు గానీ జనాల బుర్రలు ఖరాబు చేశారు. వచ్చే ఎన్నికల్లో దానిపని అది చేస్తుంది. ప్రభుత్వ హిజాబ్ నిషేధాన్ని హైకోర్టు సమర్ధించింది. దాని మీద సుప్రీం కోర్టులో అప్పీల్‌కు వెళ్లగా గతేడాది అక్టోబరులో ఇద్దరు సభ్యుల బెంచ్‌లో ఒకరు సమర్ధించగా మరొకరు తిరస్కరించటంతో అది పెద్ద డివిజన్ బెంచ్‌కు వెళ్లింది. దాని మీద తీర్పు వచ్చే వరకు నిషేధం కొనసాగుతుంది. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు ముగుస్తాయి. హిజాబ్ వివాదం కొనసాగింపుగా హలాల్‌ను ముందుకు తెచ్చారు. ప్రతిపక్షంలో ఉన్న వారు అధికార పక్షం అంగీకరించకపోతే కొన్ని అంశాలపై ప్రైవేటు బిల్లులు పెట్టటం, వాటి మీద జనంలో చర్చ రేపటం తెలిసిందే. కానీ అధికారంలో ఉన్న పార్టీకి చెందిన వారు ప్రైవేటు బిల్లులు పెట్టటం ఏమిటి? అదీ అలాంటిదే. ఒక పెద్ద నాటకం, దానిలో భాగంగానే బిజెపి ఎంఎల్‌సి రవి కుమార్ హలాల్ ధృవీకరణ పత్రాల జారీ మీద ఒక బిల్లును పెడతానని ప్రకటించారు. ముస్లిం సంస్థలు హలాల్ పత్రాల జారీకి పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఒక నిర్ణీత అధికార వ్యవస్థను ఏర్పాటు చేసేంత వరకు ముస్లిం సంస్థలు ధృవీకరణ పత్రాల జారీ నిలిపివేయాలని కోరనున్నట్లు వార్తలు. దీని గురించి ఇంతకు ముందు రవికుమార్ గవర్నర్‌కు లేఖ రాశారు. ప్రభుత్వమే హలాల్ పత్రాలను జారీ చేస్తే ఖజానాకు ఐదువేల కోట్ల మేరకు రాబడి వస్తుందని దానిలో పేర్కొన్నట్లు వార్తలు. మరొకవైపు హలాల్ మాంస ఉత్పత్తులను బహిష్కరించాలని అనేక హిందూత్వ సంస్థలు పిలుపునిచ్చాయి. ముస్లిమేతరులకు అమ్మవద్దని కెఎఫ్‌సి, మెక్‌డొనాల్డ్ దుకాణాల ముందు ధర్నాలు కూడా చేశారు. సర్టిఫికెట్ల జారీ మీద నిషేధం వేరు, హలాల్ మాంసం మీద నిషేధం వేరు అన్న సంగతి తెలిసిందే. బిజెపి ప్రజాప్రతినిధి సర్టిఫికెట్ల మీద నిషేధం పెట్టాలని కోరుతుండగా సంఘపరివార్ తెరవెనుక ఉండి నడిపిస్తున్న సంస్థలు అసలు మాంసాన్నే నిషేధించాలని రోడ్లకు ఎక్కుతున్నాయి. దీంతో కొన్ని పత్రికలు హలాల్ మాంసం మీద నిషేధం విధించే దిశగా కర్ణాటక బిజెపి సర్కార్ ఉన్నట్లు వార్తలు ఇచ్చాయి. అవన్నీ బిజెపికి కొమ్ముకాసేవే కనుక అంతరంగం ఎరగకుండా అలా రాసినట్లు భావించలేము. పోనీ వాటిని ప్రభుత్వం స్పష్టంగా ఖండించిందా అంటే అదీ లేదు, అందుకనే అనేక అనుమానాలు తలెత్తాయి.

నిజానికి ఇది మనోభావాలతో ఆడుకొనే దుష్ట ఎత్తుగడ తప్ప మరొకటి కాదు. ప్రతి మతానికి కొన్ని క్రతువులు ఉన్నాయి. కొన్ని మతాలకు చెందిన వారు లేదా కొన్ని సామాజిక తరగతులు, ఒక మతంలోనే భిన్న క్రతువులను పాటించేవారు మాంసాహారం తినకూడదనే నిషేధం ఉంది. ఇస్లాం ఆచారాలు, నిబంధనల ప్రకారం తయారు చేసిన ఆహారం మాత్రమే తినాలని, అలా లేనిదాన్ని తినకూడదని ఆ మతంలో నిషేధించారు. అందుకే ఇది తినవచ్చు అని చెప్పేందుకు గాను హలాల్ ధృవీకరణ పత్రం ఉందని ఉత్పత్తుల మీద ముద్రిస్తున్నారు. అరబ్బు దేశాలలో హలాల్ పత్రాల జారీకి చట్టబద్ధమైన సంస్థలు ఉంటాయి. మన దేశంలో అలాంటివి లేవు. హలాల్ సర్టిఫికెట్, మతం పేరుతో వసూలు చేస్తున్న పెద్ద మొత్తాలను విద్రోహ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారంటూ హిందూ జనజాగృతి సమితి (హెచ్‌జెఎస్) పేరుతో ఉన్న సంస్థ ప్రతినిధులు ఆరోపణలు చేస్తున్నారు. ఇస్లాం మత ఆచారం ప్రకారం తయారైన ఉత్పత్తులను తినాలా లేదా అన్నది ఇతర మతస్థులు ఎవరికి వారు నిర్ణయించుకోవచ్చు. దాని మీద బలవంతం ఏమీ లేదు. కానీ దీన్ని కూడా వివాదం చేశారు. గతంలో మాంసం మీద మాత్రమే అలాంటి సర్టిఫికెట్ ఉండేదని, ఇప్పుడు అనేక ఉత్పత్తులకు వాటిని జారీ చేస్తున్నారన్నది బిజెపి, హిందూత్వ శక్తుల దుగ్ధ. హలాల్ చేసినట్లు తాము చెప్పిందే తినాలి. లేనిది తినకూడదని ఇస్లామిక్ మతం చెబుతున్నది. దాన్ని అనుకరిస్తున్న లేదా అనుసరిస్తున్న కాషాయ దళాలు హలాల్ మాంసం తినకూడదని, అమ్మకూడదని చెబుతున్నాయి. ఒకే నాణానికి బొమ్మ బొరుసూ అంటే ఇదే కదా!

దేశ భవితకు యువత కీలకం

సందర్భం



డా. కె.రమాప్రభ

భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆంగ్లేయుల గుండెల్లో నిదురించిన అల్లూరి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన భగత్ సింగ్ వంటి ఎందరో యువతీయువకుల త్యాగాల వారసత్వం మనది. వీరు పెద్ద ఎత్తున సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారు. నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, కుల వివక్షతపై ఉద్యమించారు. మన దేశంలో అనేక సాంఘిక దురాచారాలపై జరిగిన ఉద్యమాల లో కీలక పాత్ర పోషించారు. విశాఖ ఉక్కు సాధనలో ప్రాణ త్యాగం చేశారు.

నూతన ఆర్థిక విధానాల అమలు తరువాత నేను, నా కుటుంబం, నా కెరీర్‌కి పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ధ్వంసం అవుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పుడు వ్యవస్థలు నాశనమవుతున్నా నా మతం, నా కులం గొడవలో కొట్టుకుపోతోంది యువత!

మన దేశానికి యువత పెద్ద సంపద. జనాభాలో 62 శాతం కంటే ఎక్కువ మంది పనిచేసే వయస్సు గలవారు (15-59 సంవత్సరాలు) వున్నారు. మొత్తం జనాభాలో 54 శాతం కంటే ఎక్కువ మంది 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్కులు. మన జనాభా పిరమిడ్ వచ్చే దశాబ్దంలో కూడా ఇదే రీతిలో కొనసాగుతుందని భావిస్తున్నారు. రాబోయే 25 ఏళ్లపాటు కొనసాగే ఈ యువ శ్రామిక శక్తిని ఉపాధి నైపుణ్యాలు మరియు విజ్ఞానంతో సన్నద్ధం చేయాలి. తద్వారా వారు దేశ ఆర్థికవృద్ధికి గణనీయంగా దోహదపడతారు. ఉపాధిని కల్పించే విధానాలు మాత్రమే ఈ దేశ అభివృద్ధికి దోహదపడతాయి.

అయితే యువత అనేక సమస్యలతో సతమతమౌతోంది. మాదకద్రవ్యాలు, మద్యం, సిగరెట్, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారు. ఆ మత్తులో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు.

ఒక దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఏమిటంటే యువతరానికి సరైన ఆలోచనా దృక్పథం లేకపోవడం. ప్రభుత్వాలు సరైన రీతిలో అవకాశాలు కల్పించక పోవడమే. యువతలో జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వం, సహనం, శౌర్యం, సాహసం యొక్క ఆలోచనను పెంపొందించాలి. వారిలో వున్న సాంస్కృతిక నైపుణ్యాన్ని వెలికితీయాలి. సామాజిక సమస్యలను అర్థం చేసుకొంటూ వాటి పరిష్కారంలో యువత భాగస్వామ్యం పెరగాలి. అందుకనుగుణంగా వారిని ప్రోత్సహించాలి. రాజకీయాలకు విద్యావంతులైన యువత దూరంగా ఉండకూడదు. చైతన్యవంతమైన యువత రాజకీయాలలో విలువలు పెంచాలి. రాజకీయాల్లో నాయకత్వం వహించడానికి ముందుకు రావాలి. చట్ట సభలకు వెళ్లి శక్తివంతంగా నడిపించాలి.

యువత భాగస్వామ్యం పెంచేందుకు జాతీయ యువజన దినోత్సవాన్ని కింది అంశాలపై క్షేత్ర స్థాయిలో నిర్వహించవచ్చు.

ఎంపిక చేసిన గ్రామం/వాడలలో శ్రమదానం/సేవా కార్యక్రమాలు నిర్వహించి గ్రామ/వార్డు స్థాయిలో ఒక క్లబ్‌ను ఏర్పాటు చేయడం. - యువత ప్రజాక్షేత్రంలో తమ భావాలను వ్యక్తీకరించడానికి బహిరంగ చర్చలు జరపడం. గ్రామ, నివాస ప్రాంతంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు-పరిష్కార మార్గాలపై 30 ఏళ్ల లోపు వారితో చర్చా కార్యక్రమం నిర్వహించడం. - సోషల్ మీడియాలో యువత, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలి? వంటి అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించడం. - క్రీడలు, ఇతర పోటీలు నిర్వహించడం. విజేతలకు బహుమతులు అందజేయడం. - స్థానిక సంస్థలలో భాగస్వామ్యం కావడం, గ్రామాభి వృద్ధికి స్వచ్ఛంద సేవలను అందించడం, స్థానిక క్రీడలు, సంస్కృతులను ప్రోత్సహించడం... వంటి కార్యక్రమాల ద్వారా యువత భాగస్వామ్యం పెంచాలి.

/ వ్యాసకర్త సామాజిక కార్యకర్త, సెల్ : 9492348428/

నేడు జాతీయ యువజన దినోత్సవం

గోవింద్ పన్సారే హత్య కేసులో నిందితులపై అభియోగాలు నమోదు



ముంబయి : హేతువాది, సిపిఐ నేత గోవింద్ పన్సారే హత్య కేసులో ప్రమేయం ఉన్న 10 మంది నిందితులపై బుధవారం మహారాష్ట్ర కొల్హాపూర్‌లోని ప్రత్యేక కోర్టు అభియోగాలు మోపింది. పన్సారే హత్య జరిగిన ఎనిమిదేళ్ల అనంతరం ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఐపిసి సెక్షన్ 302 (హత్య), 307 (హత్యకు యత్నించడం), 120-బి (నేరపూరిత కుట్ర) లతో పాటు ఆయుధాలు అక్రమంగా కలిగి ఉండటం, వినియోగించడం వంటి ఆయుధాల చట్ట కింద కూడా అభియోగాలు నమోదు చేసినట్లు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది శివాజీరావ్ రాణె తెలిపారు. నిందితులు సమీర్ గైక్వాడ్, వీరేంద్ర సింగ్ తావ్డే, అమోల్ కాలే, వాసుదేవ్ సూర్యవంశి, భరత్ కురానే, అమిత్ దేగ్వేకర్, శరద్ కలస్కర్, సచిన్ అందూరే, అమిత్ బడ్డీ, గణేష్ మిస్కిన్‌లపై ఉగ్రవాద నిరోధక బృందం ప్రత్యేక జడ్జి ఎస్ ఎస్. తంబె అభియోగాలు నమోదుచేశారు. మరో ఇద్దరు నిందితులు వినయ్ పవార్, సారంగ్ అకోల్కర్‌లు పరారీలో ఉన్నారు. ఈ కేసులో సాక్షుల జాబితాను, దర్యాప్తు సంస్థల పత్రాలను సమర్పించాలని ఆదేశించింది. నిందితులు నేరాన్ని అంగీకరించారని, విచారణకు సిద్ధంగా ఉన్నారని నిందితుల తరపు న్యాయవాది పేర్కొన్నారు. పన్సారే 2015, ఫిబ్రవరి 16న కొల్హాపూర్‌లో హత్యకు గురయ్యారు. మార్నింగ్ వాక్ నుండి తిరిగి వస్తుండగా ఇద్దరు దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. బుల్లెట్ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాలుగు రోజుల అనంతరం పన్సారే మరణించారు.

జమ్ముకాశ్మీర్‌లో వాహనం లోయలోపడి ముగ్గురు సైనికులు మృతి

శ్రీనగర్ : ప్రమాదవశాత్తు ముగ్గురు సైనికులు లోయలో పడి మరణించిన ఘటన జమ్ముకాశ్మీర్‌లో జరిగింది. కుప్వారా జిల్లాలోని మచిల్ సెక్టార్‌లో బుధవారం ఈ ఘటన జరిగినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) సమీపంలో షెడ్యూల్ ప్రకారం రోజువారీ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్మీ వాహనం ప్రమాదవశాత్తు లోయలోకి జారిపోయిందని అన్నారు. ఈ ప్రమాదంలో జూనియర్ కమిషర్ అధికారి (జెఒసి) సహా ముగ్గురు సైనికులు మరణించినట్లు తెలిపారు. మచిల్ సెక్టార్ లోని చినార్ వారియర్ వద్ద ట్రాక్‌పై మంచు అధికంగా ఉండటంతో వాహనం జారి లోయలో పడిందని శ్రీనగర్‌కి చెందిన చినార్ కాప్స్ ట్విటర్‌లో పేర్కొంది.

జీవన వ్యయ సంక్షోభం..
డిజిటల్ అసమానతలు

- పెను సవాళ్ల జాబితాలో చోటు
- భారత్‌కు స్వల్ప, దీర్ఘకాలాల్లో ప్రతికూల పరిస్థితులు
- డబ్ల్యుఈఎఫ్ గ్లోబల్ రిస్క్ రిపోర్ట్



న్యూఢిల్లీ : దేశంలో జీవన వ్యయ సంక్షోభం, డిజిటల్ అసమానత, వనరుల కోసం భౌగోళిక రాజకీయ పోటీ, ప్రకృతి వైపరీత్యాలు, విపరీత వాతావరణ సంఘటనలు స్వల్ప మరియు మధ్య కాలంలో భారత్‌కు అతిపెద్ద ప్రమాదమని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) తెలిపింది. తన గ్లోబల్ రిస్క్ రిపోర్ట్-2023లో ఈ విషయాన్ని పేర్కొంది. అలాగే, భారత్‌తో పాటు ఇతర ప్రపంచ దేశాలూ స్వల్ప, దీర్ఘ కాలంలో పలు సమస్యలను కలిగి ఉన్నాయని వివరించింది. డబ్ల్యుఈఎఫ్ నివేదిక నేపథ్యంలో భారత్‌లోని పరిస్థితులపై నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం మరింత అప్రమత్తమై దూరదృష్టితో వ్యవహరించకపోతే నష్టాలు భరించలేని విధంగా ఉంటాయని హెచ్చరించారు.

డబ్ల్యుఈఎఫ్ నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా స్వల్పకాలిక (రెండు సంవత్సరాలు)లో జీవన వ్యయం, ప్రకృతి వైపరీత్యాలు, విపరీత వాతావరణ సంఘటనలు, భౌగోళిక ఆర్థిక ఘర్షణ, వాతావరణమార్పులను తగ్గించడంలో వైఫల్యం, పెద్ద ఎత్తున పర్యావరణ నష్ట సంఘటనలు వంటివి ఉన్నాయని నివేదిక పేర్కొన్నది. దీర్ఘకాలంలో (పదేండ్లు) వాతావరణ మార్పులను తగ్గించడంలో వైఫల్యాలు, వాతావరణ మార్పుల అనుకూలత, జీవ వైవిధ్య నష్టం, పెద్ద ఎత్తున అసంకల్పిత వలసలు, సహజ వనరుల సంక్షోభాలు వంటివి అతిపెద్ద నష్టాలు ఉన్నాయి. "2023 ప్రారంభమయ్యే నాటికి ప్రపంచం పూర్తిగా కొత్త మరియు వింతగా తెలిసినట్టుగా భావించే ప్రమాదాలను ఎదుర్కొంటుంది. ద్రవ్యోల్బణం, జీవన వ్యయ సంక్షోభాలు, వాణిజ్య యుద్ధాలు, అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి మూల ధన ప్రవాహం, విస్తృతమైన సామాజిక అశాంతి, భౌగోళికరాజకీయ ఘర్షణ, అణుయుద్ధం భయం వంటి పాత నష్టాలను మేము 'తిరిగి' చూశాము" అని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ 2023 పేర్కొన్నది.

ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిణామాలతో ఈ నష్టాలు విస్తరించాయని నివేదిక పేర్కొన్నది. వీటిలో నిలకడలేని స్థాయి రుణాలు, తక్కువ వృద్ధి కొత్త శకం, తక్కువ ప్రపంచ పెట్టుబడి మరియు డీగ్లోబలైజేషన్, దశాబ్దాల పురోగతి తర్వాత మానవాభివృద్ధిలో క్షీణత, వేగవంతమైన మరియు ద్వంద్వ-వినియోగ (పౌర మరియు సైనిక) సాంకేతికతల అనియంత్రిత అభివృద్ధి, వాతావరణ మార్పు ప్రభావాల పెరుగుతున్న ఒత్తిడి వంటివి ఉన్నాయి. భౌగోళిక రాజకీయ ప్రత్యర్థులు, అంతర్గతంగా కనిపించే వైఖరులు ఆర్థిక పరిమితులను, స్వల్ప, దీర్ఘకాలిక నష్టాలను మరింత తీవ్రతరం చేస్తాయి. ఐరోపాలో మహమ్మారి, యుద్ధం వంటివి శక్తి, ద్రవ్యోల్బణం, ఆహారం, భద్రతా సంక్షోభాలను తిరిగి తెర పైకి తెచ్చాయని నివేదిక పేర్కొన్నది. స్వల్ప కాలానికి మించి వాతావరణ మార్పు అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనే అతి పెద్ద ప్రమాదం, మానవాళి అతి తక్కువగా సిద్ధంగా ఉన్న సవాలు ఇదేనని నివేదిక వివరించింది. ఆహారం, ఇంధనం, వ్యయ సంక్షోభాలు సామాజిక దుర్బలత్వాలను తీవ్రతరం చేశాయని పేర్కొన్నది. సంఘటిత సంక్షోభాలు సమాజాల అంతటా వాటి ప్రభావాన్ని విస్తృతం చేశాయని వివరించింది. జనాభాలో చాలా విస్తృతమైన వర్గాల జీవనోపాధిని దెబ్బతీశాయని పేర్కొన్నది. ప్రపంచంలోని మరిన్ని ఆర్థిక వ్యవస్థలను అస్థిరపరిచాయనీ వివరించింది. అయితే, చాలా తక్కువ-ఆదాయ దేశాలు అప్పు, వాతావరణ మార్పు, ఆహార భద్రత వంటి బహుళ సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయని నివేదిక పేర్కొన్నది. అనేక దిగుమతి ఆధారిత మార్కెట్‌లలో రాబోయే రెండేండ్లలో ప్రస్తుత జీవన వ్యయ సంక్షోభం విస్తృత మానవతా సంక్షోభంగా మారే ప్రమాదమున్నదని హెచ్చరించింది. సామాజిక అశాంతి, రాజకీయ అస్థిరత అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో మాత్రమే ఉండదనీ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలనూ దెబ్బ తీయవచ్చని నివేదిక వివరించింది.

విద్యుత్ పథకాలకు జిఎస్‌టి పోటు

- భారీగా పెరిగిపోతున్న అంచనాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విద్యుత్ పథకాలకు జిఎస్‌టి భారంగా మారుతోంది. 18 శాతం జిఎస్‌టి అమలు చేయాల్సిరావడంతో ప్రాజెక్టుల అంచనాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఇది కాంట్రాక్టర్లకు భారంగా పరిణమిస్తోంది. ప్రాజెక్టుల తొలి అంచనాలకు, జిఎస్‌టి అమలు తరువాత వేల కోట్ల రూపాయల్లో తేడా ఉండటంతో ప్రభుత్వంపైనా ఒత్తిడి పెరుగుతోంది. కొత్తగా నిర్మాణం తలపెట్టిన అప్పర్ సీలేరు పంప్‌డ్ స్టోరేజి పథకం తొలి అంచనా 10,445కోట్లు కాగా, తాజాగా జిఎస్‌టి అమలు అంటూ దీని విలువను 11,881 కోట్లకు పెంచేశారు. అంటే ఒకటే పథకంపై ఏకంగా 1346 కోట్లు విలువ పెరిగినట్టయింది. అలాగే నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంపైనా ఇదే పెరుగుదల కనిపించింది. తొలుత రూ.1,837 కోట్లతో ఉన్న అంచనా వ్యయం ఇప్పుడు 2,428 కోట్లకు చేరుకుంది. ఇది కూడా జిఎస్‌టి కారణంగానే అని అధికారులు చెబుతున్నారు. రాయలసీమ విద్యుత్ కేంద్రం 210 మెగావాట్ల విద్యుత్ రెండు కేంద్రాల తొలి అంచనా 330 కోట్లుగా ఉండగా, ఇప్పుడు 390 కోట్లకు చేరుకుంది. పథకాలకే కాకుండా ఆడిట్ వ్యయంపైనా జిఎస్‌టి భారం కనిపిస్తోంది. దీనికోసం ముందుగా 85 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయగా, తాజాగా 127 కోట్లకు చేరుకుంది. దీంతో అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి కాంట్రాక్టర్లు కూడా ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అధికారులు అంటున్నారు. ఇదే సమయంలో అధికారులపైనా కాంట్రాక్టర్ల నుంచి వత్తిళ్లు పెరుగుతున్నాయని, అందుకే అంచనా విలువలో కొంత తగ్గించాల్సి వస్తోందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఇది ఖజానాకు కూడా భారంగా మారుతోందని చెప్పారు.

పోలవరం ముంపుపై
రేపు కీలక సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్యపై శుక్రవారం నాడు కీలకభేటీ జరగనుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపు, పర్యావరణ అనుమతులను ఆంధ్రప్రదేశ్ పాటించడంలేదని భాగస్వామ్య రాష్ట్రాలైన తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పోలవరం బాగస్వామ్య రాష్ట్రాలతో చర్చించి పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని కేంద్ర జలసంఘాన్ని గత ఏడాది సెప్టంబర్‌లో ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ఏడాది డిసెంబర్‌లో సిడబ్ల్యుసి నాలుగు రాష్ట్రాలతో సమావేశం నిర్వహించింది. ఆ సమావేశంలో తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలను వ్యక్తం చేసాయి. పోలవరంలో 150 అడుగులమేర నీటిని నిల్వచేస్తే భద్రాచలంతో మరో 100 గ్రామాలు ముంపునకు గురవుతాయని..2022లో గోదావరికి వచ్చిన వరదలను కారణంగా చెబుతూ తెలంగాణ అభ్యంతరం తెలిపింది. అలాగే మిగిలిన రాష్ట్రాలు కూడా తమ ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాలు ముంపుకు గురవుతాయని తెలిపాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ముంపు సమస్యపై సమగ్రంగా సర్వే చేశామని, అన్ని రకాల అనుమతులతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని, ఏ రాష్ట్రానికి కొత్తగా ముంపు సమావేశం ఏమి వుండదని సిడబ్ల్యుసి ఆ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తేల్చి చెప్పినా మూడు పొరుగు రాష్ట్రాలు ముంపు వస్తుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్రాజెక్టు ముంపు సమస్యపై సాంకేతిక ఆధారాలతో సమావేశానికి హాజరుకావాలని ఈ నెల 13కు వాయిదా వేసింది. శుక్రవారంనాడు జరిగే సమావేశంకు సాంకేతిక కారణాలు, ఆధారాలతో హాజరుకావాలని కేంద్ర జలసంఘం సూచించింది. ఈ సమావేశం సమగ్రంగా చర్చించి ఒక నివేదకను రూపొందించి ఫిబ్రవరి 27న సుప్రీంకోర్టుకు నివేదించేందుకు కేంద్ర జలసంఘం సమయాత్తమవుతున్నాయి. ఫిబ్రవరి 27లోపు నాలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులతోనూ సమావేశం జరిపి భవిష్యత్‌లో పోలవరం ప్రాజెక్టుపై ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా ఒక విధాననిర్ణయం తీసుకునేలా కేంద్ర జలసంఘం కసరత్తు చేస్తోంది.

రైల్వేల్లో 3.12 లక్షలకుపైగా ఉద్యోగ ఖాళీలు

- సిబ్బంది కొరతతో ఉద్యోగులపై పని ఒత్తిడి

న్యూఢిల్లీ : భారతీయ రైల్వేలో 3.12లక్షలకు పైగా ఉద్యోగ ఖాళీలు ఏర్పడ్డాయని, దీంతో రైల్వేలో సిబ్బంది కొరత తీవ్రస్థాయిలో ఉందని కేంద్ర ప్రభుత్వ గణాంకాల్ని ఉటంకిస్తూ ఆంగ్ల దినపత్రిక ఒకటి వార్తా కథనం వెలువరించింది. సిబ్బంది కొరత వల్ల రైల్వేలో ఉద్యోగులపై పని ఒత్తిడి తీవ్రస్థాయిలో ఉందని, ఓవర్‌టైమ్ పనిచేయాల్సి వస్తోందని తెలిపింది. ఉద్యోగ ఖాళీలను సాకుగా చూపుతూ ఔట్‌సోర్సింగ్ విధానంలో సిబ్బందిని నియమిస్తున్నారని రైల్వే ఉద్యోగ, కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. రైల్వే ఉద్యోగాలు భర్తీచేయాలంటూ దేశవ్యాప్తంగా యువత ఆందోళనబాట పట్టినా, పరిస్థితిలో మార్పు రావటం లేదని, మోడీ సర్కార్ ఖాళీల భర్తీ చేపట్టడం లేదని వార్తా కథనం పేర్కొంది. రైల్వే శాఖ ప్రకటించిన 40వేల ఉద్యోగాల భర్తీ ఎప్పుడు పూర్తవుతుందా? అని 10లక్షల మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని తెలిపింది.

మూడు కొత్త కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు

- కేంద్ర మంత్రివర్గ నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


కొత్తగా మూడు కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు కేంద్రమంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. బుధవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం జరిగింది. రూపే డెబిట్ కార్డులు, యుపిఐ లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు మూడు కొత్త కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ మీడియాకు వెల్లడించారు. సేంద్రీయ ఉత్పత్తులు, విత్తనాలు, ఎగుమతుల ప్రోత్సహకానికి గానూ మూడు కో-ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. నేషనల్ ఎక్స్ పోర్ట్ సొసైటీ, నేషనల్ కోపరేటివ్ సొసైటీ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్, నేషనల్ లెవల్ మల్టీ స్టేట్ సీడ్ కో- ఆపరేటివ్ సొసైటీ పేరిట వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే, దేశీయంగా రూపే డెబిట్ కార్డులతో పాటు, తక్కువ విలువ కలిగిన భీమ్-యుపిఐ లావాదేవీలను ప్రోత్సహించేందుకు కేంద్రం రూ.2,600 కోట్లు కేటాయించినట్లు తెలిపిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కలకత్తాలోని జోకాలో నేషనల్ సెంటర్ ఫర్ డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ అండ్ క్వాలిటీ పేరును శ్యామ ప్రసాద్ ముఖర్జీ నేషనల్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ వాటర్ అండ్ శానిటేషన్ (ఎస్పిఎం-ఎన్ఐఎఎస్)గా మార్చేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

ఈక్వెడార్ బాలికకు ఏవియన్ ఫ్లూ

క్విటో : ఈక్వెడార్‌లోని మనుషుల్లో మొదటి ఏవియన్ ఫ్లూ (ఇన్‌ఫ్లూయెంజా ఎ-హెచ్ 5) కేసు నమోదైంది. తొమ్మిదేళ్ల బాలికలో ఈ వైరస్‌ను గుర్తించినట్లు ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌పి) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. వైరస్ వాహకాలుగా ఉన్న పక్షుల కారణంగా ఈ ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెంది ఉండవచ్చని పేర్కొంది. ఈక్వెడార్‌లోని బొలివర్ ప్రావిన్స్‌లో గుర్తించబడిన ఈ కేసు.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ పబ్లిక్ హెల్త్ (ఇన్‌స్పి) ప్రయోగశాలలో నిర్ధారణైందని ఎంఎస్‌పి నివేదించింది. జ్వరం, గొంతు నొప్పి, దగ్గు లక్షణాలు ఉన్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని అన్నారు.

అమెరికాలో స్తంభించిన విమాన సర్వీసులు

- భద్రతా పరమైన హెచ్చరికలు ఇచ్చే కంప్యూటర్ వ్యవస్థలో సమస్యలు
- నిలిచిపోయిన 2500 విమానాలు



వాషింగ్టన్ : అమెరికాలో విమానయాన సర్వీసులన్నీ హఠాత్తుగా స్తంభించిపోయాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ)లో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో అమెరికా అంతటా సేవలు నిలిచిపోయాయి. బుధవారం రోజంతా విమానాలన్నీ ఎయిర్‌పోర్టులకే పరిమితమయ్యాయి. విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విమానాలు తిరిగే మార్గాల్లో మార్పులు చేర్పులు, వాతావరణ సమస్యలు, ప్రమాదాల గురించి విమాన సిబ్బందిని ఎప్పటికప్పుడు అలర్ట్ చేసేందుకు ఎఫ్ఏఏ.. ఎయిర్‌లైన్లకు ఇచ్చే నోటమ్ (నోటీస్ టు ఎయిర్ మిషన్స్) వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తిందని ఎఫ్ఏఏ ట్విట్టర్‌లో వెల్లడించింది. దీన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది.

అయితే ఇది ఎప్పటికి పరిష్కారమవుతుందనేది ఇప్పుడే చెప్పలేమని ఎఫ్ఏఏ పేర్కొంది. ఈ సమస్య కారణంగా నేషనల్ ఎయిర్‌స్పేస్ వ్యవస్థ కార్యకలాపాలకు ఆటంకం కలిగినట్టు తెలిపింది. సమస్య కారణంగా అమెరికా వ్యాప్తంగా విమాన సేవలు స్తంభించిపోయాయి. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం ఉదయానికి దేశవ్యాప్తంగా 400లకు పైగా విమానాల రాకపోకలకు ఆటంకం కలిగినట్టు ఫ్లైట్ అవేర్ డేటా వెల్లడించింది.

దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము గంటల తరబడి ఎయిర్‌పోర్టుల్లోనే పడిగాపులు కాస్తున్నామని, అధికారుల నుంచి ఎలాంటి సమాచారమూ లేదని సోషల్‌మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిస్టమ్‌ను పునరుద్ధరించేందుకు ఎంత సమయం పడుతుందనేది అంచనా వేయలేమని, హాట్‌లైన్‌ను యాక్టివేట్ చేసినట్టు అమెరికా రెగ్యులేటర్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. సాంకేతిక లోపం తలెత్తిన పరిస్థితులను అమెరికా రవాణా మంత్రి ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్‌కు వివరించారని శ్వేతసౌధం వెల్లడించింది. సైబర్ దాడి జరిగిందనడానికి ఆధారాలు లేవని, అయితే సమస్యకు గల కారణాలపై పూర్తి విచారణ జరపాలని ఆయన ఆదేశించినట్టు శ్వేతసౌధం ప్రెస్ కార్యదర్శి ట్విట్టర్‌లో తెలిపారు.

బీహార్‌లో అమానుషం

- నిద్రిస్తున్న రైతులను చావబాదిన పోలీసులు...

పాట్నా : రైతులపై పోలీసులు కర్కశంగా విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వారిని దారుణంగా కొట్టారు. బ్రిటీష్ వారిని తలదన్నేలా పోలీసులు తమ క్రూరత్వాన్ని చూపారు. బీహార్‌లోని బక్సర్ జిల్లాలో నిర్మిస్తున్న విద్యుత్ ప్లాంట్ కోసం బనార్‌పూర్ గ్రామ రైతుల నుండి భూములు సేకరించారు. ఈ భూములకు మెరుగైన ధర చెల్లించాలని నిరసన చేస్తోన్న రైతులపై వీరంగం సష్టించారు. ఈ భూములు బీహార్ రాజధాని పాట్నాకు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. 1320 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ గత ఏడాది నుండి నిర్మాణంలో ఉంది. ఆ ప్లాంట్ కోసం సేకరించిన భూములకు 12 ఏళ్ల క్రితం నిర్ణయించిన ధరలను సవరించాలని రైతులు ఈ నిరసన చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ వీడియోలో పోలీసులు తలుపులు బద్దలుకొట్టి దూసుకురావడంతో పాటు మహిళలపై కూడా దాడిచేసినట్లు తెలుస్తోంది. ముఫాసిల్ పోలీసు స్టేషన్‌లోని సీనియర్ అధికారి అమిత్ కుమార్ ఈ దాడికి సూత్రధారుడని రైతులు పేర్కొన్నారు. యథావిధిగా బుధవారం కూడా పవర్ ప్లాంట్ ఎదుట శాంతియుతంగా నిరసన చేపట్టామని రైతులు పేర్కొన్నారు. మార్కెట్ ధరలను అనుసరించి తమ భూముల ధరలను సవరించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అయితే ఉదయం పవర్‌ప్లాంట్‌పై ఓ గుంపు కర్రలతో, రాళ్లతో దాడిచేసిందని, పోలీసులతో గొడవపడి, వారి వాహనానికి నిప్పుపెట్టిందని మీడియా తెలిపింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులు గాయపడినట్లు పేర్కొంది.

విశ్వభారతి ప్రొఫెసర్‌ను చట్ట విరుద్ధంగా తొలగించారు..

- రాష్ట్రపతికి లేఖ రాసిన 261 మంది విద్యావేత్తలు

న్యూఢిల్లీ : ప్రొఫెసర్ సుదీప్త భట్టాచార్య తొలగింపును వ్యతిరేకిస్తూ 261 మంది విద్యావేత్తలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన బెంగాల్ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న భట్టాచార్యను నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీ వీసీ తొలగించారని ఆ లేఖలో ఆరోపించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని వారు రాష్ట్రపతిని కోరారు. నోమ్ చామ్స్కీ, పట్నాయక్, పార్థ ఛటర్జీ, అమిత్ బాధురీ, ప్రభాత్ పట్నాయక్, జయతీ ఘోష్, నివేదిత మీనన్..తదితరులు ఈ లేఖపై సంతకం చేశారు. విశ్వభారతీ యూనివర్సిటీ వీసీ విద్యుత్ చక్రవర్తి తీరును విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. వర్సిటీలో విద్యార్థి సంఘాలు వివిధ పరిపాలనా సమస్యలపై అసంతృప్తిగా ఉన్నాయి. చక్రవర్తి వీసీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత వర్సిటీలో జరిగిన వివిధ అక్రమాలకు వ్యతిరేకంగా ప్రొఫెసర్ భట్టాచార్య గళం వినిపించారు. దీంతో తనపై కక్షగట్టి నిబంధనల్ని అతిక్రమిస్తూ తొలగించారని భట్టాచార్య మీడియాతో చెప్పారు. ప్రొఫెసర్ భట్టాచార్యపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు వీసీ విచారణ నిర్వహించలేదని విద్యావేత్తలు రాష్ట్రపతికి తెలియజేశారు. ఎటువంటి షోకాజ్ నోటీసూ జారీచేయకుండా, దురుద్దేశాన్ని ఆపాదించారని..ఇది సరైన ప్రక్రియ కాదని విద్యావేత్తలు లేఖలో తెలియజేశారు.



విశ్వ వేదికపై 'నాటు' పాట



'పాలం గట్టు దుమ్ములోన పోట్ల గిత్త దూకినట్లు..
పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్లు..
కిర్రుసెప్పలేసుకోని కర్రసాము సేసినట్టు..
మర్రిచెట్టు నీడలోన కుర్రగుంపు కూడినట్లు...
ఎర్రజొన్న రొట్టెలోన మిరప తొక్కు కలిపినట్లు..
నా పాట సూడు.. నా పాట సూడు..
నాటు నాటు...వీర నాటు.... ఇది కుర్రకారును ఉర్రూతలూగించిన పాట. భాషతో, భావంతో, దేశవిదేశాలతో సంబంధం లేకుండా ఔత్సాహిక యువతీ యువకుల చేత స్టెప్పులు వేయించిన పాట. పల్లె పట్టు సాంస్కృతిక సంబరాన్ని, అందులోని జీవన్లయనీ వర్ణిస్తూ సాగిన ఆర్ఆర్ఆర్ చిత్రంలోని 'నాటు నాటు' పాట ఇప్పుడు విశ్వ యవనికపై సత్తా చాటింది. చిత్రసీమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే అంతర్జాతీయ 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు ఈ పాటను వరించింది. 'గోల్డెన్ గ్లోబ్' సంస్థ స్థాపించి ఏడు దశాబ్దాలకు పైగా గడిచింది. ఇంతవరకు ఏ తెలుగు పాటకు దక్కని అరుదైన గౌరవం ఈ పాట సొంతం చేసుకుంది.

2020 జనవరి 17న నాటు నాటు పాటకు బీజం పడింది. రెండే రెండు రోజుల్లో ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ ఈ పాటకు సాహిత్యం అందించారు. మల్టీస్టారర్ చిత్రాలలోనే అగ్రగామిగా నిలిచేలా ఎన్టీఆర్, రామ్‌చరణ్ నటించిన తొలిచిత్రం ఇది. ఇద్దరూ నాట్యంలో విశేష ప్రావీణ్యం ఉన్నవారే కావడంతో దర్శకుడు రాజమౌళి వారిద్దరిపై తెరకెక్కించే పాట అద్భుతంగా ఉండాలని తపన పడ్డారు.

పాట వచ్చే సందర్భాన్ని పరిశీలిస్తే.. పల్లెటూరు నుండి వచ్చిన ఇద్దరు యువకులు బ్రిటీష్ వారి ముందు తమ ప్రాంత విశిష్టతను, వారి అలవాట్లను వివరిస్తూ అక్కడున్న వారందరినీ ఉర్రూతలూగించేలా పాట నడుస్తుంది. అందుకనుగుణంగా ఆ నాటి కాలంలో వాడే పల్లె పదాలతో, గ్రామీణ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రస్తావిస్తూ చంద్రబోస్ సాహిత్యం అందించారు.

రెండు రోజుల్లో ముస్తాబైన ఈ పాటకు స్వరాలు అందించేందుకు సంగీత దర్శకుడు కీరవాణి పెద్ద కసరత్తే చేశారు. ఏకంగా 19 నెలల సమయం తీసుకున్నారట! దాదాపు 35 వర్షన్లలో ప్రయత్నించి ఈ పాటను సినిమాకు ఓ మూలస్తంభంలా నిలబెట్టారు కీరవాణి. ఆయన శ్రమకు దక్కిన గొప్ప పురస్కారం ఇది.

ఈ పాటకు కొరియోగ్రఫీ చేసిన ప్రేమ్ రక్షిత్ 80కి పైగా వివిధ రకాల స్టెప్స్‌ను రికార్డుచేశారు. చివరికి ఇద్దరు హీరోలు భుజాలపై చేతులు వేసుకుని ఒకే రకంగా కాళ్లు కదిపే స్టెప్ ఫైనల్ అయ్యింది. ఈ బిట్‌లో డ్యాన్స్ చేసేందుకు రామ్‌చరణ్, ఎన్టీఆర్ ఏకంగా 18 టేక్‌లు తీసుకున్నారు. ఈ స్టెప్ వేసేటప్పుడు అక్కడ నేల మీద వుండే దుమ్ము పైకి లేస్తుంది. దుమ్ము పైకెగరడం లేదని కూడా టేక్‌లు తీసుకున్న సందర్భం ఉన్న పాట ఇది. ఉక్రెయిన్‌లో తీసిన ఈ పాటలో కనిపించేది ఆ దేశ అధ్యక్ష భవనం. ఆ దేశ అధ్యక్షుడు కూడా ఒకనాటి సినీనటుడు కావడం వల్ల ఆర్ఆర్ఆర్ టీమ్‌కు అక్కడ పాట చిత్రీకరణ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు.

గోల్డెన్ గ్లోబ్ సంస్థ 1944లో ప్రారంభమైంది. దక్షిణాది నుంచి ఈ అవార్డు అందుకున్న వారిలో సంగీత దర్శకులు రెహమాన్ ఉన్నారు. 2009లో ఆయన ఈ అవార్డు తీసుకున్నారు. మళ్లీ ఇన్ని సంవత్సరాల తరువాత అదీ తెలుగు పాటకు దక్కిన అరుదైన గౌరవం ఇది. రామ్‌చరణ్, ఎన్టీఆర్ అభిమానులు వేర్వేరుగా ఉండవచ్చు. కాని ఈ సినిమాకు వచ్చేసరికి వారంతా ఏకమై సినిమాకు పెద్ద విజయం అందించారు. 'నాటు నాటు' పాటకు దేశ విదేశాల్లో సైతం అద్భుత రెస్పాన్స్ వచ్చింది. ఆ పాట చూసేందుకే అభిమానులు మళ్లీ మళ్లీ సినిమాను చూశారని కూడా చెప్పొచ్చు. 3.28 నిమిషాల నిడివి గల ఈ పాట 5 భాషల్లో విడుదలై 20 కోట్లకు పైగా వ్యూస్ సంపాదించింది.

రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ ఆలపించిన ఈ పాట ప్రేక్షకుల హృదయాలను ఉర్రూతలూగించింది. సంగీతం, డ్యాన్స్, సాహిత్యం కలిసి పాటకు ప్రాణం పోశాయి. సినిమా రిలీజై 10 నెలలు గడుస్తున్నా ఏదో ఒక అవార్డు.. ప్రశంసో.. 'ఆర్ఆర్ఆర్' బృందం ఇప్పటికీ సొంతం చేసుకుంటోంది. తాజాగా వచ్చిన గోల్డెన్ గ్లోబ్ అవార్డుతో మరో మెట్టు పైకెక్కింది.

ప్రశంసల జల్లు

దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ప్రపంచ చలన చిత్ర రంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'గోల్డెన్ గ్లోబ్' అవార్డును దక్కించుకుంది. ఈ నేపథ్యంలో జక్కన్నను పుష్ప డైరెక్టర్ సుకుమార్ తనదైన స్టైల్‌లో ఆకాశానికెత్తేశాడు. అవార్డు అందుకున్న సందర్భంగా రాజమౌళి స్టేజీపై మాట్లాడుతున్న స్టిల్‌ను ఇన్ స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. రాజమౌళి మై హీరో అంటూ లవ్ సింబల్ పోస్ట్ చేశాడు. 'నాటు నాటు' పాట గోల్డెన్ గ్లోబ్ అవార్డు గెలుచుకోవడం పట్ల మెగాస్టార్ చిరంజీవి హర్షం వ్యక్తం చేశాడు. మిమ్మల్ని చూసి దేశం గర్విస్తుందని సోషల్ మీడియా ద్వారా అభినందనలు తెలిపాడు. 'ఇదొక అద్భుతమైన, చారిత్రక విజయం. 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు నా అభినందనలు. దేశం మిమ్మల్ని చూసి గర్విస్తుంది. అంటూ ట్విట్టర్ వేదికగా టీమ్‌కి అభినందనలు తెలిపాడు. సంగీత దర్శకుడు, గాయకుడు ఏ.ఆర్ రెహమాన్ దీనిపై స్పందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

పేదరికంలో పుట్టి పెరిగాడు



డ్యాన్స్ మాస్టర్ ప్రేమ్ రక్షిత్ గురించి ఈ సందర్భంగా తప్పక చెప్పుకోవాలి. పేదరికంలో పుట్టి పెరిగిన ప్రేమ్‌రక్షిత్ అర్ధాకలితో పస్తులు పడుకునే కుటుంబం నుంచి వచ్చాడు. తండ్రి తమిళనాడు చిత్రసీమలో యూనియన్ సభ్యుడిగా ఉండేవారు. బాల్యం నుండే డ్యాన్స్‌పై ఇష్టం పెంచుకున్న రక్షిత్ ఏకలవ్య సాధన చేశాడు. కుటుంబ పోషణ కోసం పిల్లలకు డ్యాన్సు క్లాసులు నిర్వహించారు. ఆ సంపాదనతో కుటుంబం పోషించలేక ఒకానొక సందర్భంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. మెరీనా బీచ్ వైపు అడుగులు వేస్తున్న అతడికి ఓ వ్యక్తి నుంచి ఫోను వచ్చింది. అది ఓ సినిమా అవకాశం. ఆ ఫోన్ కాల్‌తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ప్రేమ్ రక్షిత్ ఆ తరువాత ఎన్నో పాటలకు కంపోజ్ చేశారు. అంతటి స్థితి నుంచి పైకి వచ్చిన ప్రేమ్ నేడు ఈ స్థాయికి ఎదిగారు.



ఈ పాట ఇంత హిట్ అవుతుందని నేను అనుకోలేదు. చాలా సంతోషంగా ఉంది. ఒక గల్లీ బాయ్ పేరు నేడు ప్రపంచ వేదికపై నిలిచింది. ఈ అవకాశం ఇచ్చినందుకు రాజమౌళి గారికి చాలా కృతజ్ఞతలు.

- రాహుల్ సిప్లిగంజ్, గాయకుడు



కీరవాణి గారికి, రాజమౌళి గారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు. బాహుబలి సినిమాకు నేను రాయలేకపోయాను. ఈ సినిమాకు అవకాశం వచ్చినప్పుడు చాలా సంతోషమేసింది. నా పాట కీరవాణి గారికి నచ్చాలి. రాజమౌళి గారు ఆమోదించాలన్న లక్ష్యం పెట్టుకున్నాను. పిలుపు వచ్చిన వెంటనే ఆయన్ను కలిశాను. ఇద్దరు పెద్ద హీరోలు ఒకేసారి తెరపై కనిపిస్తున్నారు. వారు చేసే ఈ పాట పెద్ద హిట్ అవ్వాలని రాజమౌళి చెప్పిన మాట నేడు నిజమైంది. చాలా సంతోషంగా ఉంది.

- చంద్రబోస్, గేయ రచయిత,



రంగు రంగుల సంక్రాంతి
రంగవల్లిలా మెరిసింది
ముంగిట ముగ్గులు వేసి
కనులకు విందు చేసింది

బడికి శెలవులు ఇస్తూనే
ఆటలు ఆడుకోమంది
అమ్మ చేసిన వంటలను
కడుపు నిండుగా తినమంది

చుక్కలు అన్ని ఏకం చేసి
పంచన ముగ్గు గీసింది
గొబ్బెమ్మలు బాగా నిలబెట్టి
ఇంటికి అందం తెచ్చింది


చలి గిలి పారిపోయేందుకు
బోగి మంటలు వేసింది
చెరకు రసంతో నాలికను
తియ్య తియ్యగా తడిమింది

అనప గింజలు ఉడికించి
ఒక్కొక్కటి తినిపించింది
గంగిరెద్దుల గంటల సవ్వడి
గమ్మత్తుగా చెవికి వినిపించింది

కోడి కూతతో మెళకువ
చైతన్యాన్ని కలిగించింది
తోటి స్నేహితుల కలిమితో
పొద్దును మరిపించింది

కొత్త కొత్త బట్టలేసుకుని
సరికొత్త ఉత్సాహం నింపింది
భక్తి శ్రద్ధలతో ప్రకృతి తల్లికి
జేజేలు పలికించింది

- నరెద్దుల రాజారెడ్డి
96660 16636



రంగవల్లి

19 చుక్కలు 1 వచ్చే వరకు
(సరి చుక్క)



ఎస్ జయ,
చింతూరు మండలం,
అల్లూరిసీతారామరాజు
జిల్లా.

మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

శ్రీజేష్‌పైనే ఆశలు..

- వరుసగా రెండోసారి భారత్ ఆతిథ్యం
- గ్రూప్-డిలో భారత్‌తోపాటు స్పెయిన్, ఇంగ్లండ్, వెల్స్
- హాకీ ప్రపంచకప్ రేపటినుంచే..



కళింగ స్టేడియం, భువనేశ్వర్



రూర్కెల హాకీ స్టేడియం, రూర్కెల

హాకీలో గోల్ కీపర్ పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. గోల్‌కీపర్ ప్రదర్శననుబట్టి ఫలితం తారుమారైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల ముగిసిన ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో అర్జెంటీనా-ఫ్రాన్స్ 3-3గోల్స్‌తో సమంగా ఉండగా.. ఆఖరి క్షణాల్లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబపే కొట్టిన బంతిని అర్జెంటీనా గోల్ కీపర్ అద్భుతంగా నిలువరించి మ్యాచ్‌ను షూటౌట్‌కు దారితీసేలా చేశాడు. ఆ ఫామ్‌నే షూటౌట్‌లోనూ చూపి అర్జెంటీనా జట్టు కప్ గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. అది ఫిఫా చరిత్రలో హైలెట్ మ్యాచ్‌గా నిలిచింది.

శుక్రవారంనుంచి భారత్ వేదికగా జరిగే హాకీ ప్రపంచప్‌లోనూ మన గోల్ కీపర్ శ్రీజేష్ అదే ప్రదర్శన కనబర్చాలని ఆశిద్దాం. గత ఏడాది జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో భారతజట్టు కాంస్య పతకం గెలవడంలో శ్రీజేష్ కీలకపాత్ర పోషించాడు. కాంస్య పతక పోటీలో పెనాల్టీల్లో జర్మనీని నిలువరించి 42ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో పతకం ఖాయం చేశాడు. ఒరిస్సాలోని భువనేశ్వర్, రూర్కెల వేదికలుగా 13నుంచి 29వరకు జరగనుంది. ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్‌లో భారత్ ఈసారి గ్రూప్-డిలో ఉండగా.. అదే గ్రూప్‌లో ఇంగ్లండ్, స్పెయిన్, వేల్స్ జట్లు ఉన్నాయి. ఈ టైటిల్‌ను అత్యధికంగా పాకిస్తాన్ నాలుగుసార్లు గెలుచుకోగా.. ఆ జట్టు ఈసారి టోర్నీకి అర్హత సాధించడంలో విఫలమైంది. 2018లోనూ భారత్ ఆతిథ్యమివ్వగా.. బెల్జియం జట్టు టైటిల్‌ను సాధించగా.. నెదర్లాండ్స్ జట్టు రన్నరప్(రజతం), ఆస్ట్రేలియాకు మూడోస్థానం (కాంస్యం) దక్కాయి. ఇంగ్లండ్‌కు నాల్గోస్థానం లభించింది. భారత్ 7వ స్థానంలో నిలిచింది.

- ప్రజాశక్తి స్పోర్ట్స్‌డెస్క్

గ్రూపులు..

గ్రూప్-ఏ : అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా
గ్రూప్-బి : బెల్జియం, జర్మనీ, జపాన్, కొరియా
గ్రూప్-సి : చిలీ, మలేషియా, నెదర్లాండ్స్, న్యూజిలాండ్
గ్రూప్-డి : ఇండియా, ఇంగ్లండ్, స్పెయిన్, వేల్స్

ప్రపంచకప్‌లో భారత్ ప్రదర్శన..

1975 : విజేత
1973 : రన్నరప్(రజతం)
1971 : 3వ స్థానం(కాంస్యం)

ఎఫ్ఐహెచ్ తాజా ర్యాంకింగ్స్..

1.	ఆస్ట్రేలియా	3053(పాయింట్లు)
2.	బెల్జియం	2857 ,,
3.	నెదర్లాండ్స్	2722 ,,
4.	జర్మనీ	2623 ,,
5.	ఇంగ్లండ్	2497 ,,
6.	భారత్	2485 ,,
7.	అర్జెంటీనా	2245 ,,
8.	స్పెయిన్	2220 ,,
9.	న్యూజిలాండ్	1918 ,,
10.	ద.కొరియా	1853 ,,



ఆంధ్ర 459/9డిక్లేర్డ్

న్యూఢిల్లీ: అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 459పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 203పరుగులతో బుధవారం ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్రజట్టును వికెట్ కీపర్ శ్రీకర్ భరత్(80), నితీష్ కుమార్(66), షోయబ్ ఖాన్(78) అర్ధసెంచరీలతో రాణించారు. ఢిల్లీ బౌలర్లు షోకీన్‌కు నాలుగు, యోగేశ్, దివిజ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 19పరుగులు చేసింది.

ఇన్నింగ్స్ తేడాతో ఓడిన హైదరాబాద్..

సౌరాష్ట్ర చేతిలో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 57పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్ 327పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు 191పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 79పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే. సౌరాష్ట్రకు బోనస్ పాయింట్ లభించింది.

పృథ్వీ షా @ 379పరుగులు

ఎలైట్ గ్రూప్-బిలో ముంబయి ఓపెనర్ పృథ్వీ షా అస్సాంపై 379పరుగులు చేసి 1948లో భవుసాహెబ్ నింబల్కర్(443నాటౌట్) తర్వాత రంజీట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. తొలిరోజే డబుల్ సెంచరీని కొట్టిన పృథ్వీ షా రెండోరోజు అదే ఫామ్‌ను కొనసాగిస్తూ.. 383బంతుల్లో 49ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో 379పరుగులు కొట్టాడు. కెప్టెన్ అజింక్యా రహానే(191) కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో ముంబయి జట్టు 4వికెట్ల నష్టానికి 687పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం అస్సాం జట్టు వికెట్ నష్టపోయి 129 పరుగులు చేసింది.

తొలిరౌండ్‌లోనే సింధు ఓటమి



కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ సూపర్-1000 మహిళల సింగిల్స్ తొలిరౌండ్‌లోనే పివి సింధు నిష్క్రమించగా.. ప్రణయ్ రాయ్ ప్రి క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ పోటీలో సింధు 12-21, 21-10, 15-21తో రియో ఒలింపిక్స్ ఛాంపియన్ కరోలినా మారిన్ చేతిలో, బన్సోద్ 9-21, 13-21తో సన్-యు-అన్(కొరియా) చేతిలో ఓటమిపాలయ్యారు. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 24-22, 21-12, 21-16తో భారత్‌కే చెందిన యువ షట్లర్ లక్ష్యసేన్‌పై చెమటోడ్చి నెగ్గాడు. ప్రి క్వార్టర్స్‌లో ప్రణయ్ వార్డోయో(మలేషియా)తో తలపడనున్నాడు. పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ జోడీ 21-16, 21-13తో కొరియా జోడీపై నెగ్గి ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు.

మళ్లీ టాపార్డర్ మెరిస్తేనే..

శ్రీలంకతో రెండో వన్డే నేడు

మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

కోల్‌కతా: తొలి వన్డేలో నెగ్గిన టీమిండియా.. ఇక సిరీస్‌పై దృష్టి సారించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గౌహతి వేదికగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి సెంచరీతో కదం తొక్కగా.. రోహిత్, శుభ్‌మన్ అర్ధ సెంచరీలతో మెరిసారు. టాపార్డర్ రాణించడంతో 374పరుగుల భారీ లక్ష్యాన్ని శ్రీలంక ముందుంచగలిగింది. శ్రేయస్, కేఎల్ రాహుల్, హార్దిక్ కూడా రాణిస్తే ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల వరద పారడం ఖాయం. తొలిగా బ్యాటింగ్ చేసే జట్టుకు విజయావకాశాలు ఎక్కువని క్యూరేటర్ల భావన. శుభ్‌మన్-రోహిత్ కలిసి తొలి వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియా భారీస్కోర్‌కు దోహదపడ్డారు. రెండోవన్డేకు ఇరుజట్లు మార్పుల్లేకుండానే బరిలోకి దిగే అవకాశముంది. మరోవైపు శ్రీలంక కెప్టెన్ శనక మినహా మిగతా బ్యాటర్స్ నిరాశపరుస్తున్నారు. టీమిండియా 374పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక ముందుంచినా.. శనక చివరి వరకు క్రీజ్‌లో నిలిచి సెంచరీతో కదం తొక్కాడు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68